



సహకారం.. ప్రక్షాళన

- ఐదేళ్లలో పూర్తిగా నిర్వీర్యమయిన సహకార సంఘాల సొసైటీలు
- వైసీపీ నాయకుల కనుసన్నల్లోనే రుణాలు
- త్రీమెన్ కమిటీలను రాజకీయ పునరావాసాలుగా మార్చిన వైనం
- వాటి రద్దుకు కొత్త ప్రభుత్వం ఆదేశాలు
- పర్సన్ ఇన్‌చార్జిల నియామకానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు

ఐదేళ్ల పాటు పీఏసీఎస్‌లన్నీ వైసీపీ నేతల కబంధ హస్తాల్లో ఉండిపోయాయి. ఎన్నికల ఊసే లేకుండా త్రీమెన్ కమిటీల పేరిట నామినేటెడ్ పోస్టుల్లో వైసీపీ నేతాగణాన్ని కూర్చోబెట్టి సహకార సంఘాల ఉద్దేశాన్నే దెబ్బతీసే విధంగా వ్యవహరించారు. రైతులకు రుణాలు ఇవ్వకుండా వారికి నచ్చిన వారికే సొసైటీ రుణాలు అందే విధంగా చూశారు. అభ్యంతరం తెలిపిన ఉద్యోగులను కూడా ఇష్టారీతిన బదిలీ చేసి తమ పబ్బాన్ని గడుపుకున్నారు. ఏటా జరిపే ఆడిట్‌లో అక్రమాలు వెలుగు చూస్తున్నప్పటికీ ఆ నివేదికలను సైతం బయటకు రాకుండా తొక్కిపెట్టారు. కోట్ల రూపాయలు పక్కదారి పట్టినా రికవరీ ఊసే లేకుండా పోయింది. ఒక్కమాటలో చెప్పాలంటే సహకార సంఘాల రుణాల పేరిట వైసీపీ నేతలు పెద్ద ఎత్తున లబ్ధి పొంది అర్హులైన రైతుల నోట్లో మట్టి కొట్టారు.

బాపట్ల, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): కొత్త ప్రభుత్వం కొలువు దీరగానే ఈ సహకార సంఘాల ప్రక్షాళనపై దృష్టి పెట్టింది. పీఏసీఎస్(ప్రైమరీ అగ్రికల్చరల్‌క్రెడిట్ సొసైటీ)లో కొనసాగు తున్న త్రీమెన్ కమిటీలను వెంటనే రద్దు చేస్తున్నట్లు ఆదేశాలిచ్చింది. రాజీనామాకు కొంతమంది వైసీపీ నేతలు ససేమిరా అన్నప్పటికీ ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల ప్రకారం సాంకేతికంగా వారు పదవుల్లో లేనట్లే. ఆయా సొసైటీల్లో పర్సన్ ఇన్ చార్జిల నియామకానికి సహకార శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. త్వరలోనే వారి నియామకం జరగనుంది.

2018లోనే ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా..

సహకార సంఘాలకు చివరిసారి ఎన్నికలు 2013లో జరిగాయి. షెడ్యూల్ ప్రకారం 2018లో నిర్వహించాల్సి ఉంది. అప్పట్లో సొసైటీల పాలకవర్గాన్ని ఏడాది కాలం పాటు పొడిగిస్తూ ఉత్తర్వులిచ్చారు. 2019లో వైసీపీ ప్రభుత్వం గద్దెనెక్కగానే ఎన్నికల సంప్రదాయానికి తిలోదకాలిస్తూ సెవన్‌మెన్ కమిటీ, త్రీమెన్ కమిటీలపేరిట వైసీపీ నేతలను సొసైటీల్లోని పదవుల్లో నామినేటెడ్ ప్రాతిపదికన నియమిస్తూ వచ్చింది. ఆరునెలల కొకసారి వారి పదవీకాలం పొడిగించుకుంటూ వచ్చింది తప్పితే సొసైటీలకు ఎన్నికలు జరిపి పాలకవర్గాలను నియమించే ప్రయత్నం చేయలేదు. మధ్యలో ఒకట్రెండు సార్లు సహకార సంఘాలకు ఎన్నికలంటూ హడావిడి చేసి ఓటరు జాబితాలను కూడా సిద్ధం చేశారు. తర్వాత వాటిని పట్టించుకున్న పాపాన వైసీపీ పోలేదు.

ఐదేళ్లలో అనేక అక్రమాలు..

వైసీపీ నేతాగణమే సొసైటీ పదవుల్లో ఉండడంతో రుణాల విషయంలో అనేక అక్రమాలకు వారు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. అద్దంకి నియోజకవర్గ పరిధిలోని పంగలూరు మండలం నూజెళ్లపల్లి సొసైటీలో లాకర్‌లో బంగారం లేకుండానే రైతుల పేరిట వైసీపీ నేతలే రూ.2.20 కోట్ల రుణాలు పొందిన బాగోతం గతంలో వెలుగు చూసింది. అది బయటపడడంతో అధికారుల హడావిడి తప్పితే రికవరీ మాటేలేదు. డీసీసీబీల పరిధిలో కొందరు బ్యాంకు అధికారులు, వైసీపీ నేతలు కుమ్మక్కై కోట్ల రూపాయల రుణాలను నకిలీ పట్టాదారు పాసు పుస్తకాలతో రుణాలు పొందారన్న ఆరోపణలు గతంలో వచ్చాయి. ఉమ్మడి గుంటూరు డీసీసీబీ పరిధిలోనే దాదాపు రూ.80 కోట్లకు పైగానే సొమ్ము దుర్వినియోగమైందని రైతులు అంటున్నారు. ఉమ్మడి ప్రకాశం డీసీసీబీ కిందకు వచ్చే చీరాల, అద్దంకి, పర్చూరు సొసైటీల్లో కూడా పెద్దఎత్తున అక్రమాలు జరిగాయని వాటన్నింటిపై సమగ్ర విచారణ జరగాలనే డిమాండ్లు రైతుల నుంచి వ్యక్తమవుతున్నాయి.



పంగలూరు మండలంలోని నూజెళ్లపల్లి పీఏసీఎస్ భవనం

ఉద్యోగులపైనా వేధింపులు..

అవినీతి ఆరోపణలే కాకుండా ఉద్యోగులను వేధించడంలో త్రీమెన్ కమిటీలు ఇష్టారీతిన వ్యవహరించాయి. రాజకీయ కారణాలతో ఎప్పటి నుంచో పనిచేస్తున్న ఉద్యోగులను తొలగించి వారి స్థానంలో వైసీపీ విధేయులకు పోస్టింగ్ ఇచ్చుకున్నారు. 2019 కన్నా ముందు సొసైటీల్లో పనిచేస్తున్న ఉద్యోగులను పర్మినెంట్ చేసేందుకు అప్పటి టీడీపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం పాత తేదీలు వేసి మరీ వారికి కొమ్ముకాసే ఉద్యోగులను రెగ్యులర్ చేశారన్న విమర్శలు అప్పట్లో వ్యక్తమయ్యాయి. రుణాల పేరిట స్వాహా చేసిన మొత్తాలతో పాటు ఉద్యోగుల రెగ్యులరైజ్ విషయంలో జరిగిన అవకతవకల విషయంలో సమగ్ర విచారణ దిశగా కొత్త ప్రభుత్వం ప్రక్షాళన మొదలెట్టింది.

ఆడిట్ నివేదికలపై దృష్టి...

ప్రతి ఏడాది సొసైటీల్లో చేపట్టే ఆడిట్ నివేదిక వివరాలను గత ప్రభుత్వం గోప్యంగా ఉంచింది. ఇప్పుడు కొత్త ప్రభుత్వం రావడంతో రాష్ట్రస్థాయిలోనే ఆ నివేదికలపై కదలిక ప్రారంభమైంది. ఆయా సొసైటీల్లో వాటికి సంబంధించిన నివేదికలపై తీవ్ర కసరత్తు జరుగుతున్నట్లు తెలుస్తోంది. వైసీపీ నేతల సేవలో తరించిన వీరవిధేయ ఉద్యోగులు ఇప్పటికే సెలవుపై వెళ్లినట్లు సమాచారం. ఆడిట్ నివేదికలతో పాటు ఐదేళ్ల వ్యవధిలో రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులు ఇవన్నీ బేరీజు వేసుకుని ఎక్క డెక్కడ అక్రమాలు జరిగాయన్న విషయం గుర్తించి వారిపై చర్యలు తీసుకునే దిశగా ప్రభుత్వం వడివడిగా అడుగులేస్తోంది.

పర్సన్ ఇన్‌చార్జిల నియామకం..

సొసైటీల్లోని కమిటీలన్నీ కూడా రద్దు కావడంతో సహకార సంఘాల్లో పర్సన్ ఇన్‌చార్జిల నియామకానికి ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదనలు పంపారు. అక్కడ నుంచి గ్రీన్‌సిగ్నల్ రాగానే ఉద్యోగులు ఆయా పోస్టుల్లో కొలువు దీరనున్నారు. ఇక కొత్త ప్రభుత్వం ప్రాథమ్యాల ప్రకారం సహకార సంఘాలకు ఎన్నికలు జరపడమా లేదా అనేది త్వరలోనే నిర్ణయం కానుంది. అప్పటివరకు పర్సన్ ఇన్ చార్జిల ద్వారా పాలన నడిపించనున్నారు. ఆయా సొసైటీల్లో ఐదేళ్ల వ్యవధిలో పొందిన రుణాలు, సదరు పేర్ల వివరాలపై ఇప్పటికే నూతన ప్రభుత్వం వివరాలు సేకరిస్తోంది.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 167 సహకార సంఘాలు..

బాపట్ల జిల్లాలో మొత్తం 112 పీఏసీఎస్‌లు ఉండగా వీటిలో 68 సొసైటీలు ఉమ్మడి గుంటూరు పరిధిలోని డీసీసీబీ కింద ఉండగా, 44 పీఏసీఎస్‌లు ఉమ్మడి ప్రకాశం పరిధిలోని డీసీసీబీ కింద ఉన్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా చూస్తే మొత్తం 167 సహకార సంఘాలు ఉన్నాయి. డీసీసీబీకి సెవన్‌మెన్ కమిటీలు, పీఏసీఎస్‌లకు త్రీమెన్ కమిటీలను నామినేటెడ్ పద్ధతిన వైసీపీ ప్రభుత్వం నియమిస్తూ వచ్చింది. ఈ కమిటీల్లో ఆ పార్టీ ద్వితీయ శ్రేణి నేతాగణానికి చోటు కల్పించి ఇష్టారీతిన వ్యవహరించారు. నూతన ప్రభుత్వం కొలువుదీరగానే కొంతమంది వెంటనే రాజీనామాలు సమర్పించగా, ప్రభుత్వం జారీచేసిన జీవో ప్రకారం ఆ పదవులన్నీ రద్దయినట్లయింది. అన్ని కమిటీలకు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం తప్పుకోవాలనే నోటీసులు కూడా సహకార శాఖ పంపించింది.



నెరవేరిన కల

- మూడు జిల్లాల్లో 318మంది గ్రేడ్-5 కార్యదర్శులకు డీడీవో అధికారాలు
- జీవో ఇచ్చి నాలుగు నెలలు తొక్కిపెట్టిన గత ప్రభుత్వం
- ఎన్నికల ముందు ఫిబ్రవరిలో హడావుడిగా జీవో జారీ
- కొత్త ప్రభుత్వం రాకతో ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు

గుంటూరు, జూన్ 24(ఆంధ్రజ్యోతి): గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శుల కల ఎట్టకేలకు నెరవేరింది. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన వేళ వారికి డీడీవో అధికారాలు సొంతమయ్యాయి. 2019లో సచివాలయ పరీక్షల ద్వారా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 568 మందిని పంచాయతీ కార్యదర్శి గ్రేడ్-5గా గత ప్రభుత్వం ఎంపిక చేసింది. కానీ వారందరినీ సచివాలయాలకే పరిమితం చేసి గ్రామ పంచాయతీ వ్యవస్థను నీరుగార్చింది. వందల సంఖ్యలో పంచాయతీలు ఖాళీగా వున్నా.. అంతకు మించిన సంఖ్యలో పంచాయతీ కార్యదర్శులు కళ్లెదుటే వున్నా వారికి అధికారాలు మాత్రం ఇవ్వలేదు. వారిని సచివాలయాల్లోనే ఉంచి జాబ్‌చార్టు ఇవ్వకుండా వెట్టిచాకిరీ చేయించుకుంది. ఫలితంగా కార్యదర్శులు లేక పంచాయతీల పనితీరు పూర్తిగా దెబ్బతింది. ఉద్యోగుల నుంచి ఒత్తిడి వస్తుండడంతో కార్యదర్శులకు అధికారాలు ఇస్తామని 2022లోనే వైసీపీ ప్రభుత్వం జీవో నెం.149 విడుదల చేసి హడావుడి చేసింది. ఆ తరువాత జీవోను బుట్టదాఖలు చేసింది. మరలా ఈ ఏడాది ఎన్నికలకు ముందు హడావుడిగా ఫిబ్రవరి 15న మరోమారు జీవో ఎంఎస్. నెం.11 పేరుతో మరో జీవో విడుదల చేసింది. అది కూడా అమలుకు నోచుకోలేదు.

నాలుగు నెలల క్రితమే జీవో..

నాలుగు నెలల క్రితమే ప్రభుత్వం జీవో ఇచ్చినా జిల్లా స్థాయిలో అధికారులు జీవోలను తొక్కిపెట్టారు. గత ప్రభుత్వానికి ఎన్నికల్లో లబ్ధి చేకూర్చాలన్న ఉద్దేశంతోనే తమకు విధులు కేటాయించకుండా తాత్సారం చేశారని గ్రేడ్-5 కార్యదర్శులు గతం నుంచి ఆరోపిస్తూనే ఉన్నారు. ఉమ్మడి జిల్లా కలెక్టర్ వారి ఆరోపణలకు బలం చేకూర్చేలా వుంది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 1230 గ్రామ పంచాయతీలు వుండగా, దాదాపు 700 మంది గ్రేడ్- 1, గ్రేడ్-2, గ్రేడ్-3, గ్రేడ్- 4 పంచాయతీ కార్యదర్శులు వున్నారు. 2019లో సచివాలయ పరీక్షల ద్వారా మరో 568 మందిని గ్రేడ్ -5 పంచాయతీ కార్యదర్శులు ఎంపికైనా వారికి విధులు కేటాయించలేదు. దీంతో వారంతా సచివాలయాల్లో, గ్రేడ్- 1- 4 కార్యదర్శుల సహాయకులుగా మాత్రమే మిగిలిపోయారు. డీడీవో పవర్ ఇవ్వలేదు. పంచాయతీ కార్యదర్శులకు ఉండే డీడీవో పవర్ మాటేమోగానీ, కనీసం జనన, మరణ, వివాహ నమోదు, ధ్రువీకరణ పత్రాల జారీ, పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాల వంటి ప్రాథమిక విధులు కూడా వారికి దక్కలేదు. దీంతో చాలా పంచాయతీల్లో సాధారణ పరిపాలన దెబ్బతింది. 'ఒక పంచాయతీ ఒక కార్యదర్శి' దస్త్రాలపై 2023 సెప్టెంబరులోనే అప్పటి ముఖ్యమంత్రి సంతకం చేసినప్పటికీ అది జిల్లాలో అమలుకు నోచుకోలేదు. పంచాయతీ కార్యదర్శులను వారి శాఖకు సంబంధించిన విధులకు పరిమితం చేయకుండా సంబంధం లేని అనేక విధులకు కేటాయిస్తున్నారు. అందులో భాగంగా దాదాపు 91 మందికి బీఎల్‌వో విధులు కేటాయించారు. ఆ విధులకు అటంకం ఏర్పడుతుందన్న కారణంగా అపాయింటింగ్ అథారిటీగా వున్న గుంటూరు జిల్లా కలెక్టర్ జీవోను అమలు చేయకుండా ఆపారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.

318 మందికి పంచాయతీల కేటాయింపు

గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలో మొత్తం 318 మందికి ప్రత్యేకంగా గ్రామ పంచాయతీలు కేటాయించారు. ఇప్పటి వరకూ అమలులో ఉన్న క్లస్టర్ విధానాన్ని రద్దు చేసి, క్లస్టర్ పరిధిలో ఉన్న అన్ని గ్రామ పంచాయతీలకు ప్రత్యేకంగా ఒక పంచాయతీ కార్యదర్శిని కేటాయించారు. పల్నాడు జిల్లాలో అత్యధికంగా 159 పంచాయతీలకు, బాపట్ల జిల్లాలో 89 పంచాయతీలకు, గుంటూరు జిల్లాలో 70 పంచాయతీలకు పంచాయతీ కార్యదర్శులను కేటాయించారు. కాగా ఇప్పటికే పంచాయతీల పరిధిలో పనిచేస్తున్నవారికి ఆయా పంచాయతీలనే ఖరారు చేశారు. కాగా రెండు, మూడు సచివాలయాలు ఉన్న మేజర్ పంచాయతీల్లో సీనియర్ కార్యదర్శిని యథాతథంగా కొనసాగిస్తున్నారు. కాగా సచివాలయాల్లో వున్న గ్రేడ్-5 కార్యదర్శులకు మాత్రం పంచాయతీలను కేటాయించలేదు. ఇలాంటి వారు 50 మంది వరకూ వున్నట్లు తెలుస్తోంది. దీనికి తోడు పోటీ పరీక్షలు, ఇతర ఆరోగ్య సమస్యల కారణంగా సెలవుపై మరో 40 మంది వరకూ ఉండొచ్చని తెలుస్తోంది. వారందరికీ పోస్టింగు పెండింగులో వుంది. ఖాళీగా ఉన్న పంచాయతీలను గుర్తించి వారిని ఆ పంచాయతీలకు కేటాయిస్తామని అధికారులు చెబుతున్నారు.

నాలుగున్నరేళ్ల పోరాట ఫలితం..

మాకు పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించిన కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు రుణపడి వుంటాం. గత ప్రభుత్వం మమ్మల్ని నియమించినా, సేవలను వినియోగించుకోలేదు. మానవ వనరులన్నీ వృథా అయిపోయాయి. ఈ ప్రభుత్వం దాన్ని గమనించి సరిచేసింది. మా సేవలు పూర్తి స్థాయిలో అందిస్తాం.

- బెజ్జం రోజా ప్రకాశ్, గ్రామ వార్డు సచివాలయాల ఎంప్లాయీస్ ఫెడరేషన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు

అక్రమాలకు అడ్డా

- ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచే బియ్యం నేరుగా రైస్‌మిల్లులకు దారి మళ్లింపు
- గతంలో పలుమార్లు పట్టుబడినా నామమాత్రం కేసులతో సరి
- వీటిపైనే దృష్టి కేంద్రీకరించిన నూతన మంత్రి నాదెండ్ల మనోహర్
- మాఫియా, వారికి సహకరిస్తున్న అధికారుల గుండెల్లో గుబులు

గుంటూరు, జూన్ 24(ఆంధ్రజ్యోతి): మండల లెవల్ స్టాక్(ఎంఎల్ఎస్) పాయింట్‌లు వైసీపీ ప్రభుత్వ హయాంలో రేషన్‌బియ్యం అక్రమ రవాణకు కేంద్ర బిందువులుగా మారాయి. వీటిల్లో పనిచేస్తున్న కొంతమంది అధికారులు రేషన్ మాఫియా, రైస్ మిల్లర్లతో చేతులుకలిపి నేరుగా వాటినుంచి లారీల్లోనే బియ్యం దారి మళ్లించారు. పలుమార్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీసు అధికారులు దాడులు చేసి పట్టుకొన్నా నామమాత్రపు కేసులతోనే సరిపెట్టారు. గత వైసీపీ ప్రభుత్వంలో కొంతమంది పెద్దల అండదండలు మాఫియాకి దండిగా లభించడంతో పేదలకు అందాల్సిన సరుకులు నల్లబజారుకు తరలిపోయాయి. రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రిగా గత వారంలో బాధ్యతలు స్వీకరించిన నాదెండ్ల మనోహర్ ఈ ఎంఎల్ఎస్ పాయింట్లలో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు దృష్టి సారించారు. అందులో భాగంగా రెండురోజుల్లో వాటిని తనిఖీచేసి రిపోర్టు ఇవ్వాలని ఆదేశాలు జారీచేశారు. దీంతో సంబంధిత అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

రేషన్ సరుకులు డీలర్లకు చేర్చడంలో ఎంఎల్ఎస్ పాయింట్లది కీలకభూమిక. బస్తాకి 50 కేజీలు లెక్కకట్టి డీలర్లకు సరఫరా చేస్తున్నారు. అయితే ఒక్కో బస్తాలో కేజీ నుంచి 2 కేజీల తరుగు వస్తుందని డీలర్లు మొత్తుకొంటున్నా తూకం మాత్రం ఇన్‌చార్జ్‌లు వేయడం లేదు. కనీసం బిల్లులు కూడా ఇవ్వడం లేదని డీలర్లు వాపోతున్నారు. మరోవైపు డీలర్లు తూకం వేసి ఎండీయూలకు ఇవ్వాల్సి వస్తున్నది. దీంతో డీలర్ తీవ్రంగా నష్టపోతున్నాడు. ఇలా ఎంఎల్ఎస్ పాయింట్ల ఇన్‌చార్జ్‌లు బియ్యాన్ని మిగుల్చుకొని నేరుగా వాటి వద్ద నుంచే రైసుమిల్లులకు తరలిస్తున్నారు. ప్రతీ నెలా రెండు నుంచి నాలుగు లారీల లోడ్లు వరకు పక్కదారి పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గతంలో పోలీసు శాఖ ఒక దఫా పాతగుంటూరు ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి మాఫియాకి లారీ వెళ్లగా దానిని పట్టుకొని కేసు కూడా నమోదు చేశారు. అయితే ఈ వ్యవహారంలో వైసీపీ నేతలు జోక్యం చేసుకొని కొద్ది రోజుల్లోనే పోలీసులు అరెస్టు చేసిన మాఫియా నేతకు బెయిల్ వచ్చేలా చేశారు. విజిలెన్స్ అధికారులు ఎన్నికలకు ముందు మూడు లారీల బియ్యాన్ని పట్టుకోవడం పెద్ద సంచలనమే సృష్టించింది. దానిపై కేసుల విషయంలో పకడ్బందీగా పెట్టలేదు. ఈ విధంగా అక్రమాలకు అడ్డాగా మారిన ఎంఎల్ఎస్ పాయింట్లలో ప్రక్షాళన జరిగితేనే పేదలకు సక్రమంగా సరుకులు అందుతాయి. దీనిపై మంత్రి మనోహర్ దృష్టి పెట్టడంతో అక్రమార్కులు బెంబేలెత్తుతున్నారు. లెక్కలను సరిచేసే పనిలో నిమగ్నమయ్యారన్న ఆరోపణలు వస్తున్నాయి.

ఎండీయూ వ్యవస్థ అవసరమా...!

పౌరసరఫరాల పంపిణీ చట్టం ద్వారా రేషన్ డీలర్ల వ్యవస్థని దశాబ్దాల క్రితమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేశాయి. ఈ వ్యవస్థ ద్వారానే గత నాలుగేళ్ల క్రితం వరకు సరుకుల పంపిణీ సజావుగా జరిగింది. ఎప్పుడైతే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందో ఆ తర్వాత ఏడాదికి ఎండీయూ వ్యవస్థని తీసుకొచ్చింది. తానేదో ప్రజలను ఉద్ధరిస్తున్నట్లుగా అప్పట్లో సీఎం జగన్ కలరింగ్ ఇచ్చారు. డీలర్లను నిబంధనలకు విరుద్ధంగా స్టాకిస్టులుగా మార్చారు. దీనివలన అటు డీలర్లకు కమీషన్‌తో పాటు ఎండీయూలకు ఒక్కో వాహనానికి దాదాపుగా రూ.21వేల వరకు చెల్లించాల్సిన పరిస్థితి. ఇది అదనపు భారంగా పరిణమించింది. రేషన్ సరుకులను డోర్ డెలివరీ చేయాలన్న లక్ష్యంతో ఎండీయూ వ్యవస్థని తీసుకొచ్చి చివరికి రోడ్ డెలివరీగా మార్చారు. మరోవైపు ఎండీయూలు అంతా రేషన్ మాఫియాతో చేతులు కలిపారు. క్రమంగా వారి ఆధీనంలోకి వెళ్లారు. కొందరైతే నేరుగా రైసుమిల్లుల యజమానులతో ఒప్పందాలు చేసుకొని బియ్యాన్ని అక్రమ రవాణ చేస్తున్నారు. ప్రజలకు బియ్యానికి బదులుగా కేజీకి రూ.15 నగదు ఇచ్చి వీళ్లు రైసుమిల్లర్లకు రూ.22కు విక్రయిస్తూ రూ.లక్షలు పోగేసుకొంటున్నారు. గుంటూరు జిల్లాలో రేషన్ మాఫియా ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నేతల వద్దకు వెళ్లి వాలిపోతుంటుంది. వీటన్నింటిపై జిల్లాకు చెందిన పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టి పెట్టి అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. అలానే ఎండీయూ వ్యవస్థ అవసరమో, లేదోనన్న దాని పైనా సమీక్ష చేసి తుది నిర్ణయం తీసుకోవాలి.



అర్జీలను స్వీకరిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ రాజకుమారి, ఉన్నతాధికారులు

వినతుల స్వీకరణ

- ప్రారంభమైన ప్రజా సమస్యల పరిష్కార వేదిక
- అర్జీలను స్వీకరించిన ఇన్‌చార్జి కలెక్టర్ రాజకుమారి
- సరైన సమాచారం లేకపోవడంతో పలుచగా హాజరైన అర్జీదారులు
- ఉన్నతాధికారుల గైర్హాజరుపై ఇన్‌చార్జి కలెక్టర్ ఆగ్రహం

గుంటూరు(తూర్పు), జూన్24: సార్వత్రిక ఎన్నికలు, నూతన ప్రభుత్వ ఏర్పాటు కారణాలతో వాయిదా పడ్డ సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం దాదాపు మూడు నెలల తరువాత కలెక్టరేట్, శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం పునఃప్రారంభమైంది. గతంలో జరిగే స్పందన స్థానంలో నూతన ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదిక తీసుకువచ్చింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు సరిగ్గా ఉదయం 9.45 గంటలకు ఇన్‌చార్జి కలెక్టర్ రాజకుమారి గణియా నేతృత్వంలో కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఉన్నతాధికారుల గైర్హాజరుపై సీరియస్

కార్యక్రమానికి ముందు అర్జీలపై ఇన్‌చార్జి కలెక్టర్ రాజకుమారి సమీక్ష నిర్వహించారు. గతంలో వచ్చిన అర్జీల్లో ఎన్ని పరిష్కరించారని, పెండింగ్‌లో ఎన్ని ఉన్నాయని అనే వివరాలను ఆయా విభాగాల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఈ సమయంలో కొన్ని విభాగాలకు చెందిన ఉన్నాతాధికారులు అందుబాటులో లేకపోవడంతో ఆమె సీరియస్ అయ్యారు. కిందస్థాయి సిబ్బంది హాజరవ్వడంపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. జిల్లా ఉన్నాతాధికారులు మినహా మిగిలిన కిందిస్థాయి సిబ్బంది బయటకు పోవాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రతి సోమవారం జరిగే పరిష్కార వేదికకు ఉన్నతాధికారులు విధిగా హాజరవ్వాలన్నారు. రాలేనివారు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు.

ప్రజల నుంచి 120 అర్జీలు

సరైన సమాచారం లేకపోవడంతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అర్జీదారులు పలుచగా హాజరైయ్యారు. అర్జీ దారుల నుంచి కేవలం 120 అర్జీలు మాత్రమే అందాయి. దీంతో మధ్యాహ్నం 12.45 గంటల కల్లా కార్యక్రమాన్ని ముగించారు. అర్జీలను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు లక్ష్మీకుమారి, ఎం.గంగ రాజు, డీఆర్వో పెద్ది రోజా, ఆర్డీవో శ్రీకర్, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్‌తో కలిసి ఇన్‌చార్జి కలెక్టర్ రాజకుమారి గణియా అందుకున్నారు. అనంతరం రాజకుమారి గణియా మాట్లాడుతూ గతంలో పెండింగ్‌లో ఉన్న 67 అర్జీలు, తిరిగి రీ ఓపెన్ అయిన 27 అర్జీలను పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో మోహనరావు, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మీ, సీపీవో శేషశ్రీ తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లకు మౌలిక సదుపాయాలు కల్పించాలి

మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మీరావలి ఆధ్వర్యంలో స్థానిక అడవి తక్కెళ్లపాడు టిడ్కో లబ్ధిదారులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేశారు. నీటి సమస్య, పారిశుద్ధ, కరెంట్ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఐదేళ్ల నుంచి తిరుగుతున్నా పెన్షన్ ఇవ్వలేదు

ఐదేళ్ల నుంచి పెన్షన్ ఇవ్వకుండా వేధిస్తున్నారని స్వర్ణభారతి నగర్‌కు చెందిన దివ్యాంగుడు జెప్పు రామరావు వినతి పత్రం అందజేశారు. వృద్ధాప్యం, శారీరక లోపాన్ని దృష్టిలో పెట్టుకుని పింఛన్ ఇవ్వాలని స్థానిక సచివాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేకుండాపోయిందని వాపోయాడు. గత ప్రభుత్వంలో నిర్వహించిన స్పందనలో అనేకమార్లు అర్జీ పెటుకున్నా కూడా అధికారులు స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వ పాఠశాలలో సీట్లు లేవని చెబుతున్నారు....

తమ పిల్లలను చేర్పించాలని ప్రభుత్వ పాఠశాలలను సంప్రదిస్తే సీట్లు లేవని చెబుతున్నారని నగరానికి చెందిన పేటేటి సుధీర్ తమ పిల్లలతో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రం అందజేశారు. తమ పిల్లలు 10వ తరగతి, 7 త రగతి చదువుతున్నారని, ఆ తరగతుల్లో సీట్లు కోసం అడుగుతుంటే ప్రభుత్వ పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు.

సూర్యలంక తీరంలో పర్యటన నిషేదం

● అలల ఉధృతి ఎక్కువగా ఉండడంతో..



సూర్యలంక తీరానికి పర్యాటకులు వెళ్ళకుండా రహదారిపై బారికేడ్లు ఏర్పాటు చేసిన దృశ్యం

బాపట్లరూరల్, జూన్ 24: బాపట్ల మండలం సూర్యలంక సముద్రతీరానికి సోమవారం పర్యాటకుల నిషేధాన్ని అధికారులు ప్రకటించారు. తీరానికి వాహనాలు, పర్యాటకులు వెళ్ళకుండా సూర్యలంక రహదారిపై పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. అలలు ఉధృతి ఎక్కువగా ఉండటంతో గత 2, 3 రోజుల్లోనే 15మంది యువకులు గల్లంతు కాగా మెరైన్ రూరల్ పోలీసులు, గజఈతగాళ్ళు ఆ యువకులను కాపాడి ప్రాణాలను రక్షించారు. సూర్యలంకతీరంలో పోలీసు బందోబస్తును డీఎస్పీ మురళీకృష్ణ పరిశీలించారు నాలుగైదు రోజుల తర్వాత పర్యాటకులు స్నానాలు చేసేందుకు అనుమతించటం జరుగుతుందని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. జిల్లాలోని సముద్రతీరప్రాంతాలకు యాత్రీకుల అనుమతి తాత్కాలికంగా నిషేధిస్తున్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

వైసీపీ కార్యకర్తలకు ముందస్తు బెయిల్ నిరాకరణ

నరసరావుపేట లీగల్, జూన్ 24 : వైసీపీ కార్యకర్తలకు కోర్టు ముందస్తు బెయిలు నిరాకరించింది. గత నెల 13న సాధారణ ఎన్నికల సందర్భంగా చోటు చేసుకున్న హింసాత్మక ఘటనల్లో మల్లమ్మ సెంటర్‌లో బొలేరో వాహనాన్ని దహనమైంది. ఈ కేసులో నిందితులైన పట్టణంలోని అరండల్‌పేటకు చెందిన శివరాత్రి అశోక్ కుమార్, వడ్డెర కాలనీకి చెందిన బండారు సాయి మహేష్‌లకు ముందస్తు బెయిల్‌ను నిరాకరిస్తూ స్థానిక 13వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

10 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు రాజీనామా

రెంటచింతల, జూన్ 24: మహాత్మాగాంధి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి వివిధ గ్రామాల్లో పనిచేస్తున్న 10మంది ఫీల్డ్ అసిస్టెంట్లు రాజీనామా చేశారు. వారి సిమ్ కార్డులను ఏపీవో స్వాధీనం చేసుకున్నారు.

మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డిపై ఫిర్యాదు



రొంపిచర్ల ఎస్ఐ రవీంద్రకు ఫిర్యాదు అందజేస్తున్న గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి

రొంపిచర్ల, జూన్ 24: మండలంలోని రెడ్డిపాలెం గ్రామానికి చెందిన గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిపై సోమవారం రొంపిచర్ల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 2022లో బార్ షాపులో తనకు వాటా ఇప్పిస్తానని చెప్పి రూ.20లక్షలు గోపిరెడ్డి తీసుకున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. తనకు వాటా ఇప్పించకపోవటంతో 2023లో తన డబ్బు తనకు ఇవ్వాలని అడిగినందుకు అక్రమ మద్యం కేసు పెట్టి తనకు జైలుకు పంపించాడని పేర్కొన్నాడు. ఫిర్యాదును ఎస్ఐ కేపీ రవీంద్రకు అందజేశాడు. తనకు తగిన న్యాయం చేయాలని కోరాడు.

అరాచక ఖాకీల ఆగడాలు

● ఒక్కొక్కటిగా వెలుగులోకి...
● చేయని నేరానికి పోలీసుల దాడిలో గాయపడ్డ బాధితులు
● ముడుపులు తీసుకున్నప్పటికీ వదిలిపెట్టకుండా కేసుల నమోదు
● వెలుగుచూస్తున్న వెల్దుర్తి పోలీసుల దాష్టీకాలు



బాధితులు హరికృష్ణ, ఆంజనేయులు



వైసీపీ రౌడీషీటర్ మన్నెయ్యతో కానిస్టేబుల్ చలమయ్య(వృత్తంలో..)

మాచర్ల రూరల్, జూన్ 24: గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వంలో వెల్దుర్తి మండలంలో పోలీసులు చేసిన ఆగడాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. పోలీసుల ఒత్తిడికి తట్టుకోలేక కొంతమంది పార్టీ మారగా, మరికొందరు బలవన్మరణంకు పాల్పడిన ఘటనలు కూడా ఉన్నాయి. వైసీపీ నేతలు చెప్పిందే తడవుగా టీడీపీ నేతలపై తప్పుడు కేసులు నమోదు చేయడంతోపాటు ఆర్థికంగా కూడా నష్టపరిచారు. ప్రధానంగా మండాది గ్రామంలో గత ఆరు నెలల క్రితం జరిగిన ఓ చోరీ కేసులో అనుమానితులుగా అదే గ్రామంలోని రజక సామాజిక వర్గానికి చెందిన అన్నదమ్ములైన రాయళ్ల హరికృష్ణ, ఆంజనేయులును వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. అప్పటి ఎస్ఐ శ్రీహరితో పాటు కానిస్టేబుల్ చలమయ్యలు వారిని చిత్రహింసలకు గురిచేశారు. ఒంటిపై నూలుపోగు లేకుండా చేసి బూటుకాళ్లతో తొక్కిపట్టి పంగ చీల్చి దెబ్బలు బయటకు కానరాకుండా నరకం చూపించినట్లు బాధితులు వాపోయారు. పోలీసుల చిత్రహింసలకు హరికృష్ణ స్పృహ కోల్పోగా హరికృష్ణను స్టేషన్ నుంచి బయటకు తీసుకురావడానికి నలుగురు సాయంతో మోసుకురావాల్సి వచ్చింది. నరసరావుపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నాలుగైదు రోజులు ఐసీయూలో అత్యవసర వైద్య చికిత్స అందించిన పిదప హరికృష్ణ కోలుకున్నారు. ఆసుపత్రిలో వైద్య చికిత్సకు రూ.లక్షన్నర దాకా వెచ్చించాల్సి వచ్చింది. ఇప్పటికీ తమపై ఎటువంటి ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా చేయని నేరానికి అన్నదమ్ములిరువురిని పోలీసులకు చిత్రహింసలకు గురి చేయడం మానసిక క్షోభకు గురి చేస్తోందని బాధితులు వాపోతున్నారు.

మరికొన్ని గ్రామాల్లో...

అలాగే రచ్చమలపాడుకు చెందిన ఓ వ్యక్తిపై మహిళ ఫిర్యాదు చేసింది. అయితే అతని వద్ద భారీ మొత్తంలో నగదు తీసుకొని స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపించారు. ఇది అవకాశంగా తీసుకొని వైసీపీ నాయకులు ఎస్ఐ శ్రీహరికి ఫోన్ చేసి మరలా సదరు వ్యక్తిని పోలీస్‌స్టేషన్లో వేయించారు. మరసపెంటకు చెందిన గిరిజనులపై అక్రమ మద్యం సరఫరా చేస్తున్నారంటూ స్టేషన్‌కు పిలిపించి చిత్రహింసలకు గురి చేశారు. వారు పెద్ద మొత్తంలో నగదు పోలీసులకు ముట్టజెప్పడంతో కేసు కూడా నమోదు చేయకుండా పంపించారు. అలాగే జెండాపెంటకు చెందిన మత్స్యకారుడు దుర్గారావుపై కూడా మద్యం కేసు నమోదు చేయడంతో హైకోర్టుకు వెళ్లి బెయిలు తెచ్చుకున్నారు. అయినప్పటికీ తరచూ స్టేషన్‌కు రమ్మని ఫోన్ చేయడంతో పోలీసులు కొడతారనే భయంతో దుర్గారావు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన అప్పట్లో సంచలనం రేపింది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల విషయంలో టీడీపీ గిరిజన నేతపై కేసు నమోదుతో పాటు పెద్ద మొత్తంలో డబ్బులు గుంజినట్లు సమాచారం. ఈ సంఘటనలోనే ఓ అధికారి వద్ద భారీ ఎత్తున ముడుపులు పుచ్చుకొని ప్రైవేటు వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు సమాచారం. వైసీపీ ప్రభుత్వం పోయి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వెల్దుర్తి పోలీస్‌స్టేషన్లో జరిగిన దాష్టీకాలకు సంబంధించి బాధితులు ఒక్కొక్కరిగా బయటకు వస్తున్నారు. రానున్న రోజుల్లో మరింత మంది బాధితులు బయటకు వచ్చే అవకాశం ఉంది. వెల్దుర్తి మండలంలో వైసీపీ నేతలతో అంటకాగుతూ టీడీపీ సానుభూతిపరులను హింసలకు గురిచేసిన ఎస్ఐ శ్రీహరి, కానిస్టేబుల్ చలమయ్యలు అధిక మొత్తంలో ముడుపులు రూపంలో దండుకొని ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడం జరిగిందని, వారివురు అధికారులపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

సస్పెండైనా తీరుమారలేదు...

దుర్గి మండలంలోని శ్యామరాజపురంలో అక్రమ మద్యం విక్రయిస్తున్నారంటూ ఓ వ్యక్తిపై తప్పుడు కేసు పెట్టి అప్పటి దుర్గి ఎస్ఐ రామాంజినేయులుతోపాటు కానిస్టేబుల్ చలమయ్యలు 2021లో సస్పెండ్ అయ్యారు. తరువాత చలమయ్య అప్పటి అధికార పార్టీ వైసీపీ నేతల అండదండలతో వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌కు చేరాడు. ఎస్ఐ శ్రీహరికి రైట్ హ్యాండ్‌గా ఉండి వైసీపీ నేతల ప్రోద్బలంతో టీడీపీ నేతలపై అక్రమ కేసులు బనాయించడం, భారీ స్థాయిలో ముడుపులు తీసుకొని చిత్రహింసల పాలు చేశారు.

వైసీపీ అక్రమ నిర్మాణంపై నోటీసులు

● వారం రోజుల్లో వివరణ ఇవ్వాలి

బాపట్ల, జూన్24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా బాపట్ల పట్టణంలో నిర్మించిన వైసీపీ జిల్లా కార్యాలయ భవనంపై మున్సిపల్ విభాగం దృష్టి సారించింది. ఆ భవన నిర్మాణానికి ప్లాన్ సహా ఎలాంటి అనుమతులు తీసుకోకపోవడాన్ని తీవ్రంగా పరిగణించి నోటీసులు ఇవ్వడానికి రంగం సిద్ధం చేశారు. సోమవారమే తాఖీదులు సిద్ధమయినప్పటికీ కొన్ని సంతకాలతో పాటు వైసీపీ జిల్లా అధ్యక్షులు అందుబాటులో లేకపోవడం వల్ల కూడా మంగళవారం నోటీసులు ఇవ్వనున్నారు. నోటీసులకు వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని, అప్పటికీ స్పందించకపోతే తదుపరి తీసుకునే చర్యలను వివరిస్తూ మరో సారి నోటీసులు ఇస్తామని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. ఆ తర్వాత ప్రభుత్వ ఆదేశాలను బట్టి భవనాన్ని వేరే అవసరాలకు ఉపయోగించడమో లేక కూల్చివేయడమా అనే నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని వివరించారు. మరో వైపు లీజు వ్యవహారంపై రెవెన్యూ విభాగం కూడా దృష్టి సారించింది. నామమాత్రపు అద్దెకు స్థలాన్ని లీజుకు తీసుకున్నప్పటికీ ఆ మొత్తాన్ని కూడా ఇప్పటివరకు చెల్లించలేదని తెలుస్తోంది. దీనిపై కూడా త్వరలోనే నోటీసులు ఇచ్చి వివరణ అడిగే అవకాశం ఉన్నట్లు సమాచారం

రాజప్రాసాదం లాంటి భవనంపై ప్రజల్లో చర్చ...

వైసీపీ జిల్లా కార్యాలయం పేరిట రాజప్రసాదం లాంటి భవనం నిర్మించడం పట్ల ప్రజల్లో పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. మరో వైపు పట్టణం నడిబొడ్డున విలాసమైన భవంతి నిర్మాణం జరుగుతుంటే ఎలాంటి అనుమతులు లేవని మునిస్సిపల్ విభాగం తాపీగా ఇప్పుడు చెప్పడం వైసీపీకి వ్యవస్థల గులాంగిరీకి నిదర్శనంగా కనబడుతోంది. భవనం పూర్తయి విషయం వెలుగులోకి వచ్చిన తర్వాత నోటీసులంటూ హడావిడి చేయడం పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఆ భవనం నిర్మించేటప్పుడు వైసీపీ ప్రాపకం కోసం ఉదాసీనంగా వ్యవహరించిన మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకోవాలడే డిమాండ్ ప్రజల నుంచి వ్యక్తమవుతోంది.

25, 26 తేదీల్లో నాలుగు రైళ్ల పునరుద్ధరణ

గుంటూరు, జూన్ 24(ఆంధ్రజ్యోతి): సాంకేతిక కారణాలతో గతంలో నాలుగు రైళ్లను రద్దు చేసిన రైల్వే శాఖ వాటిని పునరుద్ధరించింది. నెంబరు. 12805 విశాఖపట్టణం - లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌ని ఈ నెల 23 నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు, తిరిగి సెప్టెంబరు 16 నుంచి అక్టోబరు 15వ తేదీ వరకు రద్దు చేస్తూ నోటిఫికేషన్ జారీ చేశారు. ఇప్పుడు దానిని పక్కన పెట్టి ఈ నెల 25వ తేదీ నుంచి ఈ రైలుని యధాతథంగా నడుపుతామని ప్రకటించారు. నెంబరు.12806 లింగంపల్లి - విశాఖపట్టణం జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌ని గతంలో జూన్ 24 నుంచి ఆగస్టు 11, సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 16వ తేదీ వరకు రద్దు చేశారు. ఇప్పుడు ఈ రైలుని ఈ నెల 26వ తేదీ నుంచి పునరుద్ధరిస్తున్నట్లు పేర్కొన్నారు. నెంబరు. 17463 చెంగల్‌పట్టు - కాకినాడ పోర్టు సర్కారు ఎక్స్‌ప్రెస్‌ని ఈ నెల 23 నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు గతంలో రద్దు చేయగా దీనిని కూడా ఈ నెల 25 నుంచి పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు. నెంబరు.17644 కాకినాడ పోర్టు - చెంగల్‌పట్టు సర్కారు ఎక్స్‌ప్రెస్‌ని ఈ నెల 24 నుంచి ఆగస్టు 11వ తేదీ వరకు రద్దు చేయగా ఇప్పుడు దీనిని ఈ నెల 26 నుంచి పునరుద్ధరిస్తున్నట్లు డీఆర్ఎం ఎం రామకృష్ణ తెలిపారు.

సెప్టెంబరు నెలాఖరు వరకు ప్రత్యేక రైళ్ల సర్వీసుల పొడిగింపు

గుంటూరు మీదగా ప్రయాణిస్తున్న పలు ప్రత్యేక రైలు సర్వీసులను సెప్టెంబరు నెలాఖరు వరకు పొడిగించినట్లు డీఆర్ఎం తెలిపారు. నెంబరు. 07609 పూర్ణ - తిరుపతి రైలుని జూలై 1 నుంచి సెప్టెంబరు 30వ తేదీ వరకు, నెంబరు. 07610 తిరుపతి - పూర్ణ రైలు జూలై 2 నుంచి అక్టోబరు 1వ తేదీ వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. నెంబరు. 07632 నరసపూర్ - హైదరాబాద్ రైలుని జూలై 7 నఉంచి సెప్టెంబరు 29వ తేదీ వరకు, నెంబరు. 07445 కాకినాడ టౌన్ - లింగంపల్లి రైలుని జూలై 1 నుంచి సెప్టెంబరు 30వ తేదీ వరకు, నెంబరు. 07446 లింగంపల్లి - కాకినాడ టౌన్ రైలు జూలై 2 నుంచి అక్టోబరు 1వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు.



ఏపీవై అవార్డును అందుకుంటున్న సీజీజీబీ చైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి తదితరులు

సీజీజీబీకి ప్రతిష్టాత్మక అవార్డు

గుంటూరు, జూన్ 24: న్యూ ఢిల్లీలో పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్మెంట్ అథారిటీ (పీఎఫ్ఆర్‌డీఏ) నిర్వహించిన వార్షిక ఫెలిసిటేషన్ కార్యక్రమంలో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ (సీజీజీబీ) ప్రతిష్టాత్మక అటల్ పెన్షన్ యోజన (ఏపీవై) అవార్డుతో సత్కరించటం జరిగింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎండీ, సీఈవో ఎ.మణిమేఖలై హాజరై ఈ అవార్డు సీజీజీబీ అత్యుత్తమ పనితీరు, నిబద్ధతకు గుర్తింపని ప్రశంసించారు. సీజీజీబీ బ్యాంక్ చైర్మన్ కె.ప్రమోద్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రతిష్టాత్మక అవార్డును బ్యాంకు ఉద్యోగులకు అంకితం చేస్తూ, ఈ సందర్భంగా ఉద్యోగుల కృషి, బ్యాంకు అభివృద్ధికి ఎంతగానో తోడ్పడతాయని తెలిపారు. ఈ అవార్డు ఆర్థిక చేరికను ప్రోత్సహించటం, వినియోగదారులకు అద్భుతమైన సేవలందించినందుకు నిదర్శనమని పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్యాంకు జనరల్ మేనేజర్ డాక్టర్ బీవీ రమణారావు తదితరులున్నారు.

గణపవరంలో రెండు ఇళ్ళలో చోరీ

● రూ.10 లక్షల విలువైన సొత్తు అపహరణ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐలు

నాదెండ్ల, జూన్ 24: మండలంలోని గణపవరం గ్రామంలో రెండు ఇళ్ళల్లో చోరీ జరిగింది. ఈ ఘటనలో రూ.10 లక్షల విలువైన సొత్తును దుండగులు ఎత్తుకువెళ్ళారు. ఈ ఘటన సోమవారం ఉదయం వెలుగు చూసింది. గ్రామంలోని మువ్వావారి వీధిలో నివాసం ఉంటున్న పాలచర్ల వెంకట రఘు రామిరెడ్డి గ్రామంలోని ఒక ప్రైవేట్ మిల్లులో ఉద్యోగిగా పని చేస్తున్నాడు. తన మనుమరాలు పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొనేందుకు భార్యతో కలసి ఈనెల 19న హైదరాబాద్ వెళ్ళాడు. సోమవారం ఉదయం హైదరాబాద్ నుంచి వచ్చిన వారు ఇంటి వెనుక తలుపులు, బీరువాలు తీసి ఉండటాన్ని గుర్తించారు. బీరువాలోని రూ.2.30 లక్షలు నగదు, సుమారు ఏడు సవర్లకు పైగా బంగారు ఆభరణాలు, సుమారు రెండు కిలోల వెండి చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. కాగా సినిమా హాల్ రోడ్డులో నివాసం ఉంటున్న చిలుకూరి రమేష్ కుమారుడు అమెరికా నుంచి వచ్చాడు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులందరూ కొన్ని రోజులుగా గుంటూరులో ఉంటున్నారు. సోమవారం ఇంటికి వచ్చి చూడగా డోర్ లాక్‌లు, గేట్ల తాళాలు పగల గొట్టిన విషయాన్ని గుర్తించాడు. ఇంట్లో ఎలాంటి ఆభరణాలు, విలువైన వస్తువులు లభించక పోవటంతో దుండగులు గడ్డపారను అక్కడే పడవేసి పరారయ్యారు. గుంటూరు నుంచి వచ్చిన క్లూస్ టీమ్ వేలి ముద్రల నమూనాలను సేకరించింది. చిలకలూరిపేట రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ జే బాలరామిరెడ్డి, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు చోరీ జరిగిన ఇళ్ళను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. నాదెండ్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

55 క్వింటాళ్ళ రేషన్ బియ్యం స్వాధీనం



కొమెరపూడి విఘ్నేశ్వర రైస్ మిల్లులో స్వాధీనం చేసుకున్న బియ్యంతో విజిలెన్స్ అధికారులు

సత్తెనపల్లి, జూన్ 24: సత్తెనపల్లి మండలం కొమెరపూడిలోగల విఘ్నేశ్వర రైస్ మిల్లులో అక్రమంగా కొనుగోలు చేసి నిల్వ ఉంచిన 55 క్వింటాళ్ళ రేషన్ బియ్యాన్ని సోమవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గుంటూరు రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కె.ఈశ్వరరావు పర్యవేక్షణలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, స్థానిక సివిల్ సప్లయిస్ అధికారులు విఘ్నేశ్వర రైస్ మిల్లుపై దాడి చేసి తనిఖీలు నిర్వహించారు. గుమస్తా కృష్ణారెడ్డిని అధికారులు విచారించారు. 110 బస్తాల్లో నిల్వ ఉంచిన 55 క్వింటాళ్ళ రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు గుర్తించారు. మిల్లు యజమాని గంగాధరరెడ్డిపై 6(ఏ) కేసు నమోదుచేయాలని స్థానిక సివిల్ సప్లయిస్ డీటీ అరుణను విజిలెన్స్ అధికారులు ఆదేశించారు. తనిఖీల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులరెడ్డి, ఏ శ్రీహరిరావు, సత్తెనపల్లి సివిల్ సప్లయిస్ డీటీ అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ మాఫియాకు అడ్డుకట్ట వేస్తా

● ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

పొన్నూరుటౌన్, జూన్24: పొన్నూరు నియోజకవర్గంలో గత ఐదేళ్లుగా అవినీతి రేషన్ మాఫియాతో వచ్చిన చెడ్డపేరును మాఫియాలకు అడ్డుకట్ట వేయటం ద్వారా మార్పు చూపిస్తామన్ని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ స్పష్టం చేసారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలలో సోమవారం మండల పరిషత్ పరిధిలో అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల పరిధిలో అమలవుతున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి పనుల గురించి నివేదికలను కోరారు. రెవెన్యూ శాఖ సమీక్షలో నరేంద్ర మాట్లాడుతూ ఎన్నికల ముందు హడావుడిగా నివేశన స్థలాల కోసం ఆఫ్‌లైన్‌లో చేసిన దరఖాస్తుల రిజిస్ట్రేషన్ల వివరాలను అందచేయాలని ఆదేశించారు. కాలనీలో ఇళ్ల నిర్మాణానికి కేటగిరి 3 క్రింద నియమించిన ఏజెన్సీలకు ఏ ప్రాతిపదికన నిర్మాణ కాంట్రాక్టు ఇచ్చారని ప్రశ్నించారు. లబ్దిదారులకు కాంట్రాక్టర్లకు మధ్య ఒప్పందాలు చేయటంలో ఎందుకు ఆసక్తి చూపించారని ప్రశ్నించటంతో అధికారుల వద్ద సమాధానం లేదు. నిర్మాణసామగ్రి తరలించిన ఘటనపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డ్వాక్రా సమీక్ష సందర్భంగా ఐదేళ్ల కాలంలో జరిగిన అవకతవకలు సరిచేయాలని ఆదేశించారు. విద్యుత్‌శాఖ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండటమే కాకుండా ప్రజాసమస్యలు పరిష్కరించాలని సూచించారు. అగ్రికల్చర్ల మోటార్ల విద్యుత్ కనెక్షన్ల మంజూరు సమయంలో వసూళ్లు నిల్పివేయాలని ఆదేశించారు. అలాగే గ్రీవెన్స్‌కు వచ్చిన అర్జీలు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. గత పాలకుల అవినీతి మత్తు నుంచి అధికారులు బయటపడాలని ఎమ్మెల్యే హెచ్చరించారు. సమావేశంలలో ఎంపీడీవో పి.రత్నజ్యోతి, వివిధ ప్రభుత్వశాఖల అధికారులు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

పోలీసులకు బంగారం వ్యాపారి బురిడీ

● డబ్బు ఎగ్గొట్టేందుకు ఎత్తుగడ వేసిన నిందితుడు
● చాకచక్యంగా కేసును ఛేదించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ కళ్యాణ్‌రాజు



ఇన్‌సెట్లో సీజ్ చేసిన నకిలీ బంగారం, సెల్ ఫోన్

తాడేపల్లి, జూన్ 24: తాను ఇవ్వాల్సిన డబ్బులు ఎగ్గొట్టేందుకు బావకే టోపీ పెట్టబోయి ప్లాను బెడిసి కొట్టడంతో పోలీసులకు చిక్కిన ముద్దాయి అతని అనుచరుల ఉదంతమిది. ఈ మేరకు తాడేపల్లి సీఐ కళ్యాణ్‌రాజు సోమవారం సాయంత్రం పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ కేసు వివరాలు వెల్లడించారు. మంగళగిరికి చెందిన గోల్డ్ వ్యాపారి గుర్రంకొండ రాము గోల్డ్ వ్యాపారం చేస్తుంటాడు. తన వ్యాపార అవసరాల నిమిత్తం తన బావ, ఫిర్యాది అని పసుపులేటి వీరాంజనేయులు నుంచి రూ.90లక్షల మేర దఫదఫాలుగా నగదు తీసుకున్నాడు. తిరిగి ఆ డబ్బుల గురించి వీరాంజనేయులు అడుగుతుండగా రాము ఇవ్వకుండా కాలయాపన చేస్తూ నగదు ఎగ్గొట్టేందుకు పథకం రచించాడు. ఈ క్రమంలో ఈ నెల 19న వీరాంజనేయులుకు ఫోన్ చేసి హైదరాబాద్‌నుండి వస్తున్నాను, బంగారం తెస్తున్నాను. దానిని నీకు ఇవ్వవలసిన డబ్బుల తాలూకు తీసుకోమని, విజయవాడ ఆర్‌టిసి బస్టాండ్‌కు రమ్మని చెప్పగా ఫిర్యాది తన మోటారు సైకిల్‌పై విజయవాడ వెళ్లి రామును తీసుకుని బండిపై వస్తుండగా కొలనుకొండ మోడల్ డెయిరీ వద్దకు వచ్చేసరికి ముగ్గురు వ్యక్తులు మరో బైక్‌పై వీరిని ఫాలో అవుతూ రాము చేతిలో ఉన్న బ్యాగును లాక్కొని పరారయ్యారు. దీంతో వీరాంజనేయులు తాడేపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. నార్త్ డీఎస్పీ రవికాంత్ ఆధ్వర్యంలో తాడేపల్లి సీఐ కళ్యాణ్‌రాజు, ఎస్ఐ ప్రతాప్‌లు కేసు దర్యాప్తు చేపట్టగా సదరు రాము తన బావకు ఇవ్వాల్సిన డబ్బులు ఎగ్గొట్టేందుకు రత్న, బబ్లూ అలియాస్ శరత్‌బాబు, మహబూబ్ బాషా, ప్రసన్న అనే వారిని సంప్రదించి నకిలీ బంగారం తీసుకుని విజయవాడ నుంచి వస్తానని మార్గమధ్యలో బ్యాగు దొంగిలించి వెళ్లాలని రూ.10లక్షలు ఇస్తానని అడ్వాన్సుగా రూ.50వేలు ఇచ్చి కేసు అయితే చూసుకుంటానని వారితో చెప్పగా వారు అంగీకరించారు. దీంతో వారు ప్లాను అమలుకు రాము వాహనాన్ని అనుసరిస్తూ అతని వద్ద ఉన్న బ్యాగును దొంగిలించి పరారయ్యారు. పోలీసులు కేసును ఛేదించి కేసుతో ప్రమేయమున్న రాము, రత్న, బబ్లూ, మహబూబ్ బాషాలను సోమవారం అరెస్టు చేసి వారి నుంచి నాలుగు నకిలీ బంగారు బిస్కెట్లు ఒక మొబైల్‌ను స్వాధీనపరచుకున్నారు. ఈ కేసుకు సంబంధించి ప్రమేయమున్న మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారని, వారిని కూడా త్వరలోనే అరెస్టు చేస్తామని సీఐ కళ్యాణరాజు తెలిపారు.

జీవో నం.117ను రద్దు చేయాలి

● విద్యామంత్రికి నోబుల్ టీచర్స్ అసోసియేషన్ వినతి



మంత్రి నారా లోకేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎన్‌టీఏ రాష్ట్ర కార్యదర్శి హైమారావు

గుంటూరు(విద్య), జూన్ 24: ప్రాథమిక పాఠశాలలకు శరాఘాతంగా మారిన జీవోనం 117ను రద్దు చేయాలని నోబుల్ టీచర్స్ అసోసి యేషన్ (ఎన్‌టీఏ) నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం అమరావతిలోని సచివాలయంలో విద్యామంత్రి నారా లోకేశ్‌ను కలిసి రాష్ట్ర శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటరావు, బి.హైమారావు తదితరులు వినతి పత్రం అందజేశారు. ప్రాథమిక విద్యకు ఆటంకంగా జీవో 117 మారిందని, అనేక స్కూల్స్ మూతపడుతున్నాయని పేర్కొన్నారు. దీనిని రద్దు చేసిన ఉన్నత పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమానికి సమాంతరంగా తెలుగు మాధ్యమం ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం సంఘం నాయకులు మంత్రి నారా లోకేశ్‌ను సత్కరించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	136, 147,156
చికెన్ విత్ స్కిన్	260.00
చికెన్ స్కిన్ లెస్	270.00

40,696 టిక్కీల మిర్చి అమ్మకం

గుంటూరు, జూన్ 24(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 45,769 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 40,696 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డులో 17,563 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8000	16500
నెంబరు. 5	10000	14500
273	11000	14500
341	9000	17000
4884	--	--
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	20000
బ్యాడిగి	9000	16000
దేవనూరుడీలక్స్	10000	15500

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
తెల్లకాయలు	4500	12000
ఏసీ కామన్ వెరైటీ		
334	9000	18000
నెంబరు. 5	13500	13500
341	9000	18000
4884	10500	16500
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	19700
బ్యాడిగి	9500	15000
దేవనూరుడీలక్స్	15000	15000
తెల్లకాయలు	5500	11000

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

కష్టపడ్డ వారికి తగిన ఫలితం ఉంటుంది

● ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు



సీఎం చంద్రబాబునాయుడుతో దేగల ప్రభాకర్

గుంటూరు, జూన్ 24(ఆంధ్రజ్యోతి): పార్టీలో కష్టపడ్డవారికి తగిన గుర్తింపు, అందుకు తగ్గ ఫలితం ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. సోమవారం టీడీపీ గుంటూరు నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ సోమవారం రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబుని మర్యాదపూర్వకంగా కలిశారు. గుంటూరు నగరంలో పార్టీ గెలుపు కోసం కృషి చేసిన డేగల ప్రభాకర్‌ను చంద్రబాబు ఈ సందర్భంగా అభినందించారు. పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానని ఈ సందర్భంగా డేగల ప్రభాకర్ సీఎం చంద్రబాబుతో అన్నారు.

నీతిమాలిన రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ జగన్

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ



గుంటూరు, జూన్ 24(ఆంధ్రజ్యోతి): కరుడుగట్టిన ఫ్యాక్షనిస్టుగా నీతిమాలిన రాజకీయాలు చేసిన మాజీ సీఎం జగన్‌రెడ్డి ఆకృత్యాలకు, అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచారని అని టీడీపీ రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహన కృష్ణ వ్యాఖ్యానించారు. గుంటూరులోని తన కార్యాల యంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..వంద ఎలుకలను మింగిన పిల్లి సత్యవచనాలు ప్రవచించినట్లు తానుచేసిన పాపాలు దాచి పెడుతూ తన దరిద్రపు పాలనను గొప్పగా చెప్పుకొంటూ జగన్ మురిసిపోవడం చూస్తుంటే గురివింద గుర్తొస్తోందని ఆయన ఎద్దేవా చేశారు. దేశంలో ఏ సీఎం చేయనంత అరాచకం జగన్‌రెడ్డి చేశారన్నారు. ఎన్నికల్లో ఘోరంగా ఓటమి చెందడంతో 'ఏమైందో తెలియదు, ఏం జరిగిందో దేవుడికే తెలియాలి' అంటూ శోకాలు పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. పాలనలో టీడీపీకి వైసీపీకి నక్కకు నాగ లోకానికి ఉన్నంత తేడా ఉందని, ఇందుకు నిదర్శనమే చీరాల అత్యాచార ఘటనలో 48 గంటల్లోనే దోషుల్ని పోలీసులు అదుపులోకి తీసుకోవటమని అన్నారు. గతంలో జగన్ ఇంటికి కూతవేటు దూరంలో ఒక యువతిపై అత్యాచారం జరిగితే ఐదేళ్లపాటు ఏ చర్యలు తీసుకోలేదన్నారు. మెగా డీఎస్సీతో నిరుద్యోగ యువతకు చంద్రబాబు న్యాయం చేశారన్నారు. రాష్ట్రంలో పరిపాలన తిరిగి గాడిన పడిందని, రాష్ట్రానికి తిరిగి మంచిరోజులు వచ్చాయని ప్రజలు భావిస్తున్నారని మోహనకృష్ణ వ్యాఖ్యానించారు.



ముగింపు ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గళ్లా మాదవి, ఆలయ కమిటీ సభ్యులు

వైభవంగా ముగిసిన బ్రహ్మోత్సవాలు

గుంటూరు(తూర్పు)జూన్ 24: స్థానిక ఎస్వీఎన్ కాలనీ, పద్మావతి గోదా సమేత వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో 22వ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా ముగిశాయి. ఉదయం విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహం, అగ్నిధ్యానం, నిత్య హోమం, నవగ్రహారాధన హోమం, వెంకటేశ్వర మూల మంత్ర హోమం, చూర్ణోత్సవం, చక్రస్నానం, యాగ పూర్ణాహుతి తదితర కార్యక్రమాలను వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళ మాధవి ఆలయానికి విచ్చేసి ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం వేలాది మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ గావించారు. కార్యక్రమాలను ఆలయ అధ్యక్షుడు పట్టికూటి పూర్ణచంద్రరావు, కార్యదర్శి నల్లమోతు రత్తయ్య, కోశాధికారి పుచ్చ వెంకట మల్లేశ్వర్, ఉపాధ్యక్షుడు పావులూరి కిషోర్, సంయుక్త కార్యదర్శి ఇమ్మడి శ్రీనివాసరావు, నైషధం శ్రీనివాస్ పర్యవేక్షించారు.

సూక్ష్మ పర్యవేక్షణతో మాతృ మరణాల కట్టడి

● జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ విజయలక్ష్మీ

గుంటూరు (మెడికల్) జూన్ 24: గర్భిణులకు అందే వైద్యసేవలపై అన్ని దశలను సూక్ష్మంగా పర్యవేక్షించడం ద్వారా మాతృ మరణాలను నివారించవచ్చని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే.విజయలక్ష్మీ తెలిపారు. సోమవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో మాతృ మరణాలపై మండల స్థాయిలో సమీక్ష నిర్వహించారు. మేలో మున్నంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కొల్లిపర సచివాలయ పరిధిలో నమోదైన రెండు మాతృ మరణాలపై కమిటీ సభ్యులు ప్రధానంగా సమీక్షించారు. ఈ రెండు మరణాలు వైద్యపరంగా నివారించదగిన మరణాలుగా కమిటీ నిర్ధారించింది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మీ మాట్లాడుతూ హై రిస్క్ గర్భిణులను ముందుగానే గుర్తించి వారు సుఖ ప్రసవం అయ్యేంత వరకు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రసవానికి కొద్ది రోజులు ముందే వారిని ప్రభుత్వాస్పత్రికి పంపాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి డాక్టర్ బుచ్చిబాబు, ప్రైవేటు నోడల్ ఆఫీసర్ డాక్టర్ రాధిక రాయుడు, గైనకాలజిస్ట్ డాక్టర్ అరుణ, డాక్టర్ సుభాషిణి, డాక్టర్ ఆదిత్య ప్రదీప్ రెడ్డి, డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ శ్రావణ్‌బాబు, డాక్టర్ సీహెచ్ రత్నమన్మోహన్, డాక్టర్ కేవీ సుబ్బరాజు, డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ డాక్టర్ హరిణి పాల్గొన్నారు.



లాడ్జీ సెంటర్ వద్ద నిరసన తెలుపుతున్న టీడీపీ యువజన నాయులు

నందిగం సురేష్ వ్యాఖ్యలు సిగ్గుచేటు

● లాడ్జీ సెంటర్ వద్ద టీడీపీ నాయకుల ధర్నా

గుంటూరు(తూర్పు), జూన్24: అధికారం ఉందని ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, భవిష్యత్తులో మీకు సరైన గుణపాఠం నేర్పుతామని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌ను ఉద్దేశించి మాజీ ఎంపీ నందిగం సురేష్ చేసిన వ్యాఖ్యలపై టీడీపీ నాయకులు మండిపడ్డారు. నందిగం సురేష్ తక్షణమే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక అంబేద్కర్ కూడలిలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర నాయకులు జెల్లి అనిల్‌కుమార్ మాట్లాడుతూ నందిగం సురేష్ దళితద్రోహిగా మిగిలిపోయాడని మండిపడ్డారు. అంబేద్కర్ విదేశీ విద్య పథకానికి పేరు మార్చినపుడు నందిగం సురేష్ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. వైసీపీ పాలనలో డాక్టర్ సుధాకర్, కిరణ్ చనిపోయినపుడు స్పందించకుండా ఇప్పుడు వైసీపీ కార్యాలయం కూల్చివేతపై మాట్లడటం సిగ్గుచేటన్నారు. ఇకనైనా బూట్ పాలిష్ రాజకీయాలు మానుకోవాలని హితువు పలికారు. త్వరలోనే నందిగం సురేష్ ఇసుక అక్రమాలు బయటకు తీసుకువస్తామని స్పష్టం చేశారు. ధర్నాలో హోసన్నా, దాసు, వెంకి, శివ తదితరులు పాల్గొన్నారు.

విన్నపాలు వినవలె..

● నాలుగు నెలల తర్వాత ప్రారంభమైన ఎస్పీ గ్రీవెన్స్
● ప్రజా సమస్యల పరిష్కార వేదికగా పేరు మార్పు



డీఎస్పీ రమణమూర్తికి ఫిర్యాదు చేస్తున్న బాధితులు నరసింహారావు

గుంటూరు, జూన్ 24: జిల్లా పోలీస్ కార్యాలయంలో నాలుగు నెలల అనంతరం సోమవారం ఎస్పీ గ్రీవెన్స్ ప్రారంభమైంది. ఎన్నికల నోటిఫికేషన్ నేపథ్యంలో పోలీస్ కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే స్పందన కార్యక్రమాన్ని గత ఫిబ్రవరిలో నిలిపివేశారు. ఎన్నికల అనంతరం కొత్త ప్రభుత్వం కొలువు తీరిన తరువాత స్పందన కార్యక్రమానికి ప్రజా సమస్యల పరిష్కార వేదికగా పేరు మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో కొత్త ప్రభుత్వంలో మొదటిసారిగా సోమవారం ఎస్పీ గ్రీవెన్స్ నిర్వహించారు. అయితే సోమవారం రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఉండడంతో ఎస్పీ తుషార్ డూడీ క్యాబినెట్ సమావేశ బందోబస్తు పర్యవేక్షణకు వెళ్లడంతో అదనపు ఎస్పీలు, డీఎస్పీలు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బాధితులు తమ సమస్యలను ఆయా అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

వినతులు.. విజ్ఞాపనలు.. ఫిర్యాదులు..

తమ ప్లాట్లకు సంబంధించి జవహర్ బాబు అనే వ్యక్తి తమ నుంచి రూ.2 కోట్ల 22 లక్షలు తీసుకున్నాడని, ఆయా ప్లాట్లను బ్యాంకులో తనఖా పెట్టి మూడు కోట్ల 56 లక్షలు తీసుకున్నాడని మొత్తంగా తమ ప్లాట్లకు సంబంధించి రూ. 5 కోట్ల 70 లక్షలకు పైగా జవహర్ బాబు ఆయన కుటుంబ సభ్యులు లబ్ధి పొంది పరారయ్యారని బాధితులు ఎస్పీ గ్రీవెన్స్‌లో ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

- తన భర్తను ఎలక్ట్రీషియన్ సాయి, ఆయన అనుచరుడు కట్టా నవీన్ కత్తెరతో పొడిచి హత్యాయత్నంచేస్తే పోలీసులు కేవలం కొట్లాట కేసు నమోదు చేసి స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపారని పాత గుంటూరు యాదవ బజారుకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ పసుపులేటి నాగేశ్వరరావు భార్య ఫిర్యాదు చేశారు.

- గుంటూరు రైల్వేస్టేషన్ పార్కింగ్ స్టాండ్ వద్ద తన ద్విచక్ర వాహనంలో ఉంచిన పావు కిలో పైగా బంగారు ఆభరణాలు ఉన్న బ్యాగును దొంగలు అపహరించుకుపోయారని గోరంట్లకు చెందిన కోటి రత్నం ఫిర్యాదు చేశారు.

- ట్రాక్టర్ మెకానిక్‌గా పనిచేసే తాను యాక్సిడెంట్‌లో కాలు చేయి పోగొట్టుకొని మంచాన పడడంతో అప్పటినుంచి కుమారుడు తనకు తిండి పెట్టకపోగా ఆస్తి తనకు రాసివ్వాలని వేధిస్తున్నాడని మంగళ దాస్ నగర్‌కు చెందిన టి.నరసింహారావు ఫిర్యాదు చేశాడు. భార్య లక్ష్మీకాంతమ్మతో కలిసి ట్రై సైకిల్‌పై వచ్చిన నరసింహ రావు అధికారుల వద్ద తన గోడు మొర పెట్టుకున్నాడు.

- తాను పుట్టుకతో పోలియో కారణంగా దివ్యాంగు రాలినని అయితే తన భర్త 2022లో మృతి చెందడంతో అప్పటినుంచి తను ఒంటరిగానే ఉంటుండగా పక్కింటి వారు తనపై దాడిచేసి తరిమేశారని తాడేపల్లికి చెందిన పాలడుగు అర్జునవ ఫిర్యాదు చేశారు. దీనిపై తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదన్నారు.

- తనకు ఇద్దరు ఆడపిల్లలు పుట్టారనే కారణంగా భర్త తనకు విడాకులు ఇవ్వకుండానే మూడు పెళ్లిళ్లు చేసుకొని తనను మోసం చేశాడని పాత గుంటూరు కుమ్మరి బజారుకు చెందిన షేక్ సలీమా అనే యువతి ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం తనకు జీవన ఆధారం లేక ఇబ్బందిపడుతున్నానని, తనకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

- ఫైనాన్సులో ఏసీ ఇప్పిస్తే దానిని అమ్ముకుని తనను మోసం చేశారని సంగడిగుంట పరిధిలోని బావాజీనగర్ 3వ లైన్‌కి చెందిన పఠాన్ రబ్బాని ఖాన్ ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు.

- వైసీపీ నాయకులు తమ పొలాన్ని కాజేయాలనే ఉద్దేశంతో తమను బెదిరించి తమపై తప్పుడు కేసులు పెట్టి తమ పొలాన్ని ఆక్రమించి బెదిరింపులకు పాల్పడుతున్నారని పెదకాకాని మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన జమ్ముల నాగేశ్వరరావు, ఆయన భార్య జయలక్ష్మి ఫిర్యాదు చేశారు.

- దళితుల జీవనోపాధి కోసం కొల్లిపర మండలం పిడపర్రు గ్రామానికి చెందిన దళితులకు 1982-83లో అప్పటి ప్రభుత్వం మంజూరు చేసిన లంక భూములను కాజేసిన వైసీపీ నేతపై చర్యలు తీసుకొని ఆయా భూములను తిరిగి దళితులకు అప్పగించాలని పిడపర్రు గ్రామానికి చెందిన వీసా జ్ఞానరాజు ఫిర్యాదు చేశారు.

- కొల్లిపర మండల పరిధిలోని పిడపర్రు గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలపై తక్షణం విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన జ్ఞానరాజు అనే యువకుడు ఫిర్యాదు చేశాడు. ముఖ్యంగా పిడపర్రు గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్, మండల కేంద్రంలో ఉండే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పర్యవేక్షించే సాంకేతిక సిబ్బంది అవినీతికి పాల్పడి ప్రజాధనం కాజేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలి

● నగర పాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి



జీఎంసీ కార్యాలయంలో పార్కింగ్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్

గుంటూరు(కార్పొరేషన్), 24 ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, అర్జీలను విభాగాలవారిగా విభజించి, వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కారం చేయాలని, అర్జీలు రీ ఓపెన్ అయితే విభాగాదిపతే నేరుగా క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో పీజీఆర్ఎస్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ తొలుత నగరంలోని ప్రధాన అవుట్ ఫాల్ డ్రెయిన్లు, ఇంటర్నల్ డ్రెయిన్లలో పూడిక తీత పనులను డీఈఈల వారీగా సమీక్షించి తగు ఆదేశాలను ఆదేశించారు. వీధి దీపాలకు సంబంధించి అందే ఫిర్యాదులు 48 గంటల్లో పరిష్కారం చేయాలని, తాగునీటి సరఫరా జరిగే సమయంలో తప్పనిసరిగా ప్రతి డివిజన్‌లో శ్యాంపిల్స్ తీసి రిపోర్ట్ అందించాలని ఏఈలను ఆదేశించారు.

అనంతరం కమిషనర్ ప్రజల నుండి అర్జీలు తీసుకొని వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలన్నారు. ప్రతి సోమవారం అందే ఫిర్యాదుల పరిష్కార నివేదికను తదుపరి వారం జరిగే సమావేశంలో అందించాలన్నారు. సచివాలయ కార్యదర్శులు తమ సచివాలయ పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉండాలన్నారు. సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 47 ఫిర్యాదులు అందాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, ఎస్ఈ శ్యాం సుందర్, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, సీఎంవోహెచ్ డాక్టర్ డీ.ఆషా, మేనేజర్ ఎస్.ఎన్.ప్రసాద్, ఉపా సెల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, డీసీపీలు. ఏసీపీలు, ఈఈలు, ఆర్వోలు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

పార్కింగ్ పనులను వేగంగా చేపట్టాలి

నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో పార్కింగ్ పనులను వేగంగా చేపట్టాలని కమిషనర్ కీర్తి చేకూరి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో జరుగుతున్న పార్కింగ్ పనులను పరిశీలించి, డీఈఈ రమేష్ బాబు, ఏఈ రాంబాబులకు తగు ఆదేశాలు జారీ చేశారు.



బదిలీపై వెళుతున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డిని సత్కరిస్తున్న జిల్లా ఉన్నతాధికారులు

కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డికి ఘనంగా వీడ్కోలు

గుంటూరు, జూన్24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులుగా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని చిత్తశుద్ధితో ప్రజలకు సేవలందించాలని బదిలీపై వెళుతున్న కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్లో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో బదిలీపై వెళుతున్న కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డికి ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సత్ఫలితాలు అందించేలా సక్రమంగా అమలు చేసేందుకు జిల్లా, రెవెన్యూ, మండల, గ్రామ స్థాయి వరకు ఉన్న అధికారులు, ఉద్యోగులు పూర్తి సహకారం అందించారన్నారు. పోలీస్, రెవెన్యూ నగరపాలక సంస్థ, ఇంజనీరింగ్, వ్యవసాయం, విద్యాశాఖ, వైద్యారోగ్య తదితర శాఖలలోని కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించిన అధికారులకు ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. ఈసందర్భంగా వేణుగోపాల్ రెడ్డిని జిల్లా అధికారులు సన్మానించి ఆయన సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో ఎస్పీ తుషార్ డూడీ, టుబాకో బోర్డు ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు, సంయుక్త కలెక్టర్ జీ.రాజకుమారి, నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తీ చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి పెద్ది రోజా, గుంటూరు రెవెన్యూ డివిజన్ అధికారి శ్రీకర్, డిప్యూటీ కలెక్టర్ (ట్రైనీ) కే.స్వాతి, రాష్ట్ర ఏపీ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు పలువురు పాల్గొన్నారు.

రేపు నూతన కలెక్టర్ బాధ్యతల స్వీకారం

గుంటూరు, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా నూతన కలెక్టర్‌గా నియమితురాలైన ఎస్.నాగలక్ష్మి బుధవారం ఉదయం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈమేరకు సోమవారం ఆమె ఇన్‌చార్జి కలెక్టర్ రాజకుమారి గణియాకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. దీంతో కలెక్టర్ బాధ్యతల స్వీకారానికి సంబంధించి ఏర్పాట్లు చేయాల్సిందిగా కలెక్టరేట్ అధికారులు, సిబ్బందిని ఇన్‌చార్జి కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్‌గా నాగలక్ష్మి బాధ్యతలు చేపట్టిన తర్వాత జిల్లా అధికారులతో పరిచయ కార్యక్రమం ఉంటుందని, దానికి సంబంధించి సమయాన్ని వాట్సాప్ గ్రూపులో పెడతామని రాజకుమారి సోమవారం తెలిపారు.



చెక్కు అందజేస్తున్న బొమ్మిడాల భానుమూర్తి.చిత్రంలో అవోపా నాయకులు

గేట్ ర్యాంకర్‌కు రూ.లక్ష ఆర్థికసాయం

గుంటూరు(విద్య)జూన్ 24: గేట్‌లో ర్యాంకు సాధించి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థికి బొమ్మిడాల భానుమూర్తి ట్రస్ట్ ఆర్థిక చేయూతనిచ్చింది. ప్రకాశంజిల్లా అద్దంకి చెందిన ఇంజనీరింగ్ (ఈసీఈ) విద్యార్థి ఘంటసాల రవితేజ గేట్‌లో రెండో ర్యాంకు సాధించాడు. ముంబాయి ఐఐటీలో సీటు వచ్చింది. అయితే ఎంటెక్‌లో చేరడానికి ఆర్థిక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో విషయంలో తెలుసుకున్న బొమ్మిడాల భానుమూర్తి ట్రస్ట్ చైర్మన్ బొమ్మిడాల భానుమూర్తి వారి ట్రస్టు ద్వారా రూ.లక్ష ఆర్థికసాయాన్ని విద్యార్థి రవితేజకు అందజేశారు. స్థానిక కాకాని రోడ్డులోని జరిగిన ఈ కార్యక్రమంలో అవోపా రాష్ట్ర అధ్యక్షులు తోటపర్తి రాంబాబు, పీ.శ్రీరాములు, గాంధీక్లబ్ చైర్మన్ బంగారు బాబు, కొలిశెట్టి సతీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


వివాహానికి బొల్లి వ్యాధి అడ్డుకాదు

● డెర్మటాలజిస్ట్ డాక్టర్ అత్తోట కవిత

గుంటూరు (మెడికల్) జూన్ 24: బొల్లి అంటువ్యాధి కాదని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ డెర్మటాలజీ, వెనీరియాలజీ, లెప్రాలజీ (ఐఏ డీవీఎల్) రాష్ట్ర శాఖ అధ్యక్షురాలు డాక్టర్ అత్తోట కవిత తెలిపారు. వరల్డ్ విటిలిగో డే పురస్కరించుకొని ఐఏ డీవీఎల్ గుంటూరు శాఖ ఆధ్వర్యంలో బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో సోమవారం నిర్వహించిన బొల్లి వ్యాధి అవగాహన కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. శరీరంపై కనిపించే అన్ని తెల్ల మచ్చలు బొల్లి కాదని, చర్మంలో మెలనోసైట్ కణాలు తగ్గడం వల్ల బొల్లి వ్యాధి సోకుతుందన్నారు. బొల్లి చికిత్సల్లో పూత మందులు, ట్యాబ్లెట్లు, ఫోటో థెరపీ, లేజర్ థెరపీ, సర్జరీలు అందుబాటులో ఉన్నాయన్నారు. వ్యాధి కనిపించిన తొలి దశలో వైద్యనిపుణులను సంప్రదించి చికిత్స పొందితే సమర్థవంతంగా నియంత్రివచ్చన్నారు. కార్యక్రమంలో చర్మవ్యాధుల వైద్యనిపుణులు జే సౌజన్య, కేప సీతారామ్, ఏ శిరీష, టీ వాణి, ఉషారాణి, ఎస్ సౌమ్య, షకీల, ఎస్ నాగేశ్వరమ్మ, రాహుల్, సింధూర, నీలిమ, లాఫింగ్ క్లబ్ అధ్యక్షుడు లాల్‌వజీర్ పాల్గొన్నారు. తొలుత బొల్లిపై అవగాహన కల్పించేలా ప్లకార్డులు చేతబూని ఎన్టీఆర్ స్టేడియం నుంచి లక్ష్మీపురంలోని మదర్ థెరిస్సా విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. వైద్యులతో పాటు లాఫింగ్ క్లబ్, వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

జీవో నం.84ను తక్షణమే రద్దు చేయాలి

● ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సుబ్బారావు



సమావేశంలో మాట్లాడుతున్న మేకల సుబ్బారావు

గుంటూరు(విద్య),జూన్ 24: మునిసిపల్, కార్పొరేషన్ పాఠశాలలకు గొడ్డలి పెట్టులా మారిన జీవో నెంబర్ 84ను వెంటనే రద్దు చేయాలని ఏపీటీఎఫ్(1939) రాష్ట్ర కార్యదర్శి మేకల సుబ్బారావు డిమాండ్ చేశారు. సోమవారం నగరంపాలెంలోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన నగరశాఖ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మునిసిపల్, కార్పొరేషన్ పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు బదిలీలు, ప్రమోషన్‌లను వెంటనే చేపట్టాలని కోరారు. ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కట్టెబోయిన నరసింహారావు మాట్లాడుతూ పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత లేకుండా చూడాలని కోరారు. జిల్లా అధ్యక్షులు గోవిందు వెళాంగణిరాజు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 54 అప్ గ్రేడ్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు వెంటనే మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లా అడిట్ కమిటీ చైర్మన్ జె.విజయానంద్, ఏ.రామారావు, జిల్లా సహాధ్యక్షుడు ఓ. నాగార్జున , ఏపీటీఎఫ్ నగర ప్రధాన కార్యదర్శి కే.గోపి, నగర ఉపాధ్యక్షుడు వై. మనోజ్ కుమార్, నగర అధ్యక్షుడు ఏ.జోజప్ప, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



నారా లోకేశ్‌కు జ్ఞాపికను బహూకరిస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

విద్యారంగ సమస్యలను పరిష్కరిస్తాం..

● ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ హామీ

గుంటూరు(తూర్పు), జూన్ 24: విద్యారంగ, విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్తామని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారు. సోమవారం మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నారా లోకేశ్‌ను ఏఐఎస్ఎఫ్ నేతలు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. గత ప్రభుత్వపాలనలో విద్యార్థి సంఘాలు కలవడానికి వస్తే కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వని పరిస్థితి ఉందన్నారు. విద్యారంగంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరిస్తారని లోకేశ్ హామీ ఇచ్చారని, ఏఐఎస్ఎఫ్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.శివారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల నాసర్, రాష్ట్ర సహాయ కార్యదర్శి మహంకాళి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



ప్రగతినగర్‌లో పరిస్థితిపై అధికారులను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే నసీర్

ప్రగతినగర్ వాసులకు అండగా ఉంటా..

● గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్

గుంటూరు, జూన్ 24(ఆంధ్రజ్యోతి): ప్రగతినగర్ వాసులకు తాను అండగా వుంటానని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. ప్రగతినగర్‌లో సోమవారం ఆయన పర్యటించారు. అక్కడ మౌలిక సదుపాయాలైన తాగునీరు, డ్రెయినేజి వ్యవస్థ, రోడ్లు కూడా లేవని నసీర్ వద్ద కాలనీ వాసులు కన్నీటి పర్యంతమయ్యారు. ప్రగతినగర్‌లో మొత్తం 1137 ప్లాట్లు ఉన్నాయని, వాటిలో 885 ఇళ్లు మాత్రమే నిర్మించారని, వాటిలో 400 ఇళ్లకు మాత్రమే తాగునీటి సౌకర్యం ఉందని, డ్రెయినేజీలు లేక మురుగునీరు రోడ్లమీద నిల్వ ఉంటుందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సమస్యలపై ఎమ్మెల్యే స్పందిస్తూ నగరపాలక సంస్థ అధికారులు తక్షణమే ప్రగతినగర్ పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి ఇంటికి ఇంటి పన్ను కట్టించుకుని, ఇళ్లను క్రమబద్ధీకరించాలని సూచించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ డీఈ శ్రీధర్, ఏఈ సునీల్,జే. శ్రీనివాసరావు, మాజీ డిప్యూటీ మేయర్ గౌస్, కార్పొరేటర్లు చిస్టీ, మీరవలి, అల్లం బాజీ, బట్ట రాజ, మాదాసు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర డీజీపీగా నియమితులైన ద్వారకా తిరుమలరావును ఎమ్మెల్యే నసీర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, అభినందనలు తెలియజేశారు.

ఆర్టీసీని చిన్నాభిన్నం చేసిన వైసీపీ ప్రభుత్వం

● మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డిని కలిసి తెలుగునాడు సంఘం నాయకులు

గుంటూరు, జూన్24: వైసీపీ ప్రభుత్వం ఆర్టీసీని చిన్నాభిన్నం చేసిందని టీడీపీ ఆర్టీసీ అనుబంధ కార్మిక పరిషత్ రీజనల్ కార్యదర్శి మండవ రాజేష్ ధ్వజమెత్తారు. రోడ్డు రవాణాశాఖ మంత్రిగా రామ్‌ప్రసాద్‌రెడ్డి పదవీ బాధ్యతలు తీసుకున్న సందర్భంగా సచివాలయంలో మంత్రిని కార్మిక పరిషత్ నేతలు కలిసి అభినందనలు తెలిపారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆయన మంత్రికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నేతలు నాగభూషణం, ప్రసాద్, రామారావు, రవి , జయబాబు తదితరులు పాల్గొన్నారు.

శారదకాలనీలో ఇరువర్గాల ఘర్షణ

● బోరుగడ్డ అనుచరుడు సహా పలువురికి గాయాలు

గుంటూరు, జూన్ 24 : స్థానిక అరండల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని శారదా కాలనీ 18వ లైన్‌లో సోమవారం వేకువజామున ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. బోరుగడ్డ అనిల్‌కుమార్ అనుచరుడైన శారదా కాలనీకి చెందిన చిన్నహస్సేన్‌షా మరికొందరు ఓ వివాహానికి హాజరయ్యారు. ఇదే వివాహానికి పొన్నూరు పరిధిలోని నిడుబ్రోలు చెందిన షేక్ దాదా హుస్సేన్ అతని అనుచరులు కూడా హాజరయ్యారు. వివాహ మండపం వద్ద పిల్లలు ద్విచక్ర వాహనం నడిపే విషయంలో వారి మధ్య వివాదం చోటు చేసుకుంది. ఈ విషయమై ఇరువర్గాల మధ్య ఘర్షణ ఏర్పడింది. దీంతో దాదాహుస్సేన్ వర్గీయులు దాడి చేయడంతో బోరుగడ్డ అనుచరుడైన చిన్న హుస్సేన్‌షాతో పాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. అదేవిధంగా హుస్సేన్ షా వర్గీయులు చేసిన దాడిలో దాదా హుస్సేన్ వర్గానికి గాయాలయ్యాయి. ఇరువర్గాలు అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకోగా పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

హెల్త్ స్కీమ్‌ను పునరుద్ధరించాలి

● ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా

గుంటూరు(తూర్పు)జూన్ 24: గత ప్రభుత్వ నిర్వాకంతో కుంటుపడిన ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్‌ను పునరుద్ధరించాలని నూతన ప్రభుత్వానికి ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా విజ్ఞప్తి చేశారు. సోమవారం, మెడికల్ కళాశాల ఆవరణలోని సంఘ కార్యాలయంలో జరిగిన జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈహెచ్ఎస్ స్కీమ్ పథకాన్ని జగన్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. ఈహెచ్ఎస్ స్కీమ్ కింద ఉన్న 220 కోట్ల రూపాయిలను వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించిందిని ఆరోపించారు. నగదు రహిత చికిత్సలు లేకపోవడంతో ఉద్యోగులు, పెన్షనర్లు తీవ్రంగా ఇబ్బంది పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ విషయంపై స్పందించి ఉద్యోగులకు ఈహెచ్ఎస్ పథకంలోని అడ్డంకులను తొలగించాలని ఆయన కోరారు. సమావేశంలో సంఘ సభ్యులు శివారెడ్డి, పోతురాజు, హరిబాబు, సుబ్బారావు, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగ,ఉపాధ్యాయులను సత్కరిస్తున్న సంక్షేమ సమితి సభ్యులు

ఉద్యోగ, ఉపాధ్యాయులకు సత్కారం

గుంటూరు(విద్య),జూన్ 24: ఉద్యోగ విమరణ చేసిన ఉద్యోగ, ఉపాధ్యాయులను బ్రాహ్మణ ఉద్యోగ, ఉపాధ్యాయ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. స్థానిక బ్రాడీపేటలోని మాజేటి గురవయ్య డిగ్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి హిందూ ఫార్మసీ కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే కీలక బాధ్యతల్ని ఉపాధ్యాయులు సమర్థవంతంగా నిర్వహించారని పేర్కొన్నారు. విద్యార్థుల్లో నైతిక విలువలను పొందించేలా కృషి చేయాలన్నారు. ప్రజా సేవ చేయడమే ఉద్యోగుల మౌలిక బాధ్యతని, దానిని విస్మరించకుండా భావి ఉద్యోగులకు దిశానిర్దేశం చేయాలని సూచించారు. సంక్షేమ సమితి అధ్యక్షుడు జే.పార్థసారధి మాట్లాడుతూ నిజ జీవితంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు తరతరాలకు ఆదర్శంగా నిలుస్తారన్నారు. కార్యక్రమంలో సమితి కార్యదర్శి పీఎస్.శివన్నారాయణ, ఏబీఎం శర్మ, నరసింహారావు, నాగరత్న, హెచ్.ప్రసాద్, హెచ్ఎంలు నగేష్, కేవీ.రమణ, వేణుగోపాల్, ఆర్ చంద్రశేఖర్, జీ.లక్ష్మీ కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

భారత వాయుసేనలో అగ్నివీరులు

భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వశాఖకు చెందిన భారత వాయుసేన అగ్నిపథ్ స్కీంలో భాగంగా అగ్నివీర్ వాయు నియామకాలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలైంది.

పోస్టు: ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ - అగ్నివీర్ వాయు

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో మేథమెటిక్స్ ఫిజిక్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులతో ఇంటర్మీడియట్(10+2)/ఇంటర్మీడియట్ (సైన్స్ కాని ఇతర సబ్జెక్టులు) లేదా మూడేళ్ల ఇంజనీరింగ్ డిప్లొమా(మెకానికల్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్/ఆటోమొబైల్/కంప్యూటర్ సైన్స్/ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) తత్సమాన ఉత్తీర్ణత. నిర్దిష్ట శారీరక దారుఢ్య/వైద్య ప్రమాణాలు కలిగి ఉండాలి.

వయోపరిమితి: 2004 జూలై 3 నుంచి 2008 జనవరి 3 మధ్య జన్మించి ఉండాలి.

ఎత్తు: పురుషులు 152.5 సెం.మి.; మహిళలు 152 సెం.మీ. ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: ఫేజ్-1(ఆన్‌లైన్ రాత పరీక్ష), ఫేజ్-2(ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, అడాప్టబిలిటీ టెస్ట్-1, అడాప్టబిలిటీ టెస్ట్-2), ఫేజ్-3(మెడికల్ ఫిట్‌నెస్ టెస్ట్), ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా

పరీక్ష ఫీజు: రూ.550

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభం: జూలై 8

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: జూలై 28

ఆన్‌లైన్ పరీక్షలు ప్రారంభం: అక్టోబరు 18

వెబ్‌సైట్: agnipathvayu.cdac.in/AV/



దిక్సూచి DIKSUCHI

మాస్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్

న్యూఢిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్(ఎన్ఐహెచ్ఎఫ్‌డబ్ల్యూ)- 'మాస్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్(ఎంపీహెచ్)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

అర్హత: ద్వితీయ శ్రేణి మార్కులతో డిగ్రీ(మెడిసిన్/ఆయుష్/డెంటిస్ట్రీ/నర్సింగ్/ఫార్మసీ/వెటర్నరీ సైన్స్/ఫిజియోథెరపీ/ఆక్యుపేషనల్ థెరపీ/న్యూట్రిషన్/ఫార్మకాలజీ/అలైడ్ అండ్ హెల్త్ సైన్సెస్/లైఫ్ సైన్సెస్/బయోటెక్నాలజీ/స్టాటిస్టిక్స్/బయోస్టాటిస్టిక్స్/మేనేజ్‌మెంట్/ఇంజనీరింగ్/డెమోగ్రఫీ/పాపులేషన్ స్టడీస్/సోషియాలజీ/సైకాలజీ/ఆంత్రోపాలజీ/సోషల్ వర్క్/ఎకనామిక్స్/లా) ఉత్తీర్ణులై ఉండాలి.

○ **చివరి తేదీ:** జూలై 9

○ **వెబ్‌సైట్:** www.nihfw.ac.in

50వ జీ-7 సమావేశం

ఆహ్వానిత దేశంగా భారత్

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

(నిన్నటి దిక్సూచి తరువాయి)

జీ-7 విశిష్టత: జీ-7 దేశాలన్నీ పారిశ్రామికంగా, ఆర్థికంగా, శాస్త్ర సాంకేతికపరంగా ప్రపంచంలోనే అభివృద్ధి చెందిన దేశాలుగా ఉన్నాయి.

- అంతేకాక ఇవి ప్రపంచంలోనే అత్యధిక బంగారం నిల్వలు, అణుశక్తి ఉత్పత్తి కలిగిన దేశాలు. అధిక ఎగుమతులు కలిగిన దేశాలు.
- ఐక్యరాజ్య సమితికి నిధుల వితరణపరంగా శక్తిమంతమైన దేశాలు.
- ప్రపంచ జనాభాలో పదిశాతం మాత్రమే కలిగి ప్రపంచ నికర సంపదలో మాత్రం 60 శాతం మూటగట్టుకున్న ధనిక దేశాలు.

జీ-7 లక్ష్యం: ప్రాథమికంగా జీ-7 లక్ష్యం ఆర్థిక, రాజకీయపరమైన అంతర్జాతీయ అంశాలపరంగా సభ్యదేశాలకు సంబంధించి ఉమ్మడి వ్యూహాలను రచించడమే అయినప్పటికీ కాలక్రమంలో ఈ లక్ష్యాల పరిధి విస్తరించి అంతర్జాతీయ ఆర్థిక స్థిరత్వం, ప్రపంచ భద్రత, శక్తి/ఇంధన వనరుల సంబంధిత అంశాలు, పర్యావరణం, సామాజిక భద్రత వంటి అనేక కీలక అంశాలకు స్థానం లభిస్తోంది.

జీ-7 భారతదేశం: కొంతకాలంగా వరుసగా ఈ సమావేశాలకు ఆహ్వానాన్ని అందుకుంటున్న భారత్ జీ-7 యవనికపై తన ముద్రను వేస్తూనే ఉంది. కొవిడ్ మహమ్మారి విజృంభణను అరికట్టేందుకు భారత్ జీ-7 47వ సమావేశంలో 'వన్ ఎర్త్, వన్ హెల్త్' అనే నినాదంతో 'సమష్టి కృషి' ఆవశ్యకతను చాటిచెప్పింది. కొవిడ్ టీకా పరిశోధనల్లో, ముడి పదార్థాల అందుబాటులో దేశాల మధ్య సహకారాన్ని పెంచేందుకు కృషిచేసింది. అదేవిధంగా టీకాల అందుబాటు పెంచేందుకు అడ్డంకిగా ఉన్న ట్రిప్స్ నిబంధనలను తొలగించాలని డబ్ల్యూటీఓ(ప్రపంచ వాణిజ్య సంస్థ)లో దక్షిణాఫ్రికాతో కలిసి దాఖలు చేసిన విజ్ఞప్తిని జీ-7 దేశాల మద్దతుకు కృషిచేసింది. అదేవిధంగా 2023లో జపాన్‌లోని హిరోషిమాలో జరిగిన గత సదస్సులో ప్రధాని మోదీ మూడు ప్లీనరీ సమావేశాల్లో పాల్గొని ప్రపంచశాంతి, వాతావరణ మార్పుల నిరోధం, ఇతరత్రా బహుముఖ సంక్షోభాలపరంగా భారతవాణిని వినిపించారు. ఈ సమావేశంలో భారత్ కొన్ని అంతర్జాతీయ చొరవలకు మార్గదర్శనం చేసింది. భారత్ ప్రతిపాదించిన లైఫ్ స్టయి ల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్, ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ మిల్లెట్స్, మిల్లెట్స్ అండ్ అదర్ ఏన్షియంట్ గ్రైన్స్ ఇంటర్నేషనల్ రీసెర్చ్ ఇనీషియేటివ్ వంటి చొరవలు 'హిరోషిమా యాక్షన్ ప్లాన్ ఫర్ రిసైలియంట్ గ్లోబల్ ఫుడ్ సెక్యూరిటీ'లో గుర్తించారు.

జీ-7 భారత్ మధ్య పరస్పర ఆవసరాలు

- భారతదేశం ప్రస్తుతం ప్రపంచంలోనే అయిదో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరించింది. జీ-7లోని సగం దేశాలకు పైగా(కెనడా, ఇటలీ, జర్మనీ, ఫ్రాన్స్‌ల కన్నా కూడా) పెద్ద ఆర్థికవ్యవస్థ అయినందున జీ-7, భారత్ మధ్య సంబంధం పరస్పర లాభదాయకంగానే ఉంటుంది.
- ప్రస్తుతం ప్రాధాన్యం పొందుతున్న హిందూ-పసిఫిక్ ప్రాంత భౌగోళిక రాజకీయాల్లో గ్లోబల్ సౌత్‌కు ప్రాతినిధ్యం వహించే భారత్ భాగస్వామ్యం వ్యూహాత్మకంగా చాలా కీలకం. హిందూ-పసిఫిక్ ప్రాంతంలో విస్తరిస్తున్న చైనా ఆధిపత్యాన్ని నిలువరించడానికి జీ-7 కూటమికి భారత్ అవసరం ఉండగా, చైనాను ధీటుగా ఎదుర్కోడానికి బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్‌కు ప్రత్యామ్నాయాలు తీసుకువచ్చేందుకు కృషిచేస్తున్న జీ-7 మద్దతు భారత్‌కు అంతే అవసరం ఉంది.
- శాస్త్ర సాంకేతికరంగాల్లో, క్లీన్ ఎనర్జీ/పునరుత్పాదక శక్తిరంగం, డిజిటల్ టెక్నాలజీ వంటి రంగాల్లో ముందు వరుసలో ఉన్న జీ-7 దేశాలకు మద్దతు భారత్‌కు అవసరం. అదేవిధంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న భారతదేశం అత్యధిక జనాభాతో కూడిన అతి పెద్ద మార్కెట్‌ను జీ-7 దేశాలకు అందిస్తోంది.
- ప్రపంచ శాంతి సామరస్యాలు కాపాడటానికి, వాతావరణ మార్పుల కట్టడి చర్యలకు, ఆర్థిక నేరాలు, ఉగ్రవాదం, సముద్ర మార్గాల రక్షణ వంటి అనేక ఉమ్మడి సమస్యలపై పోరాడటానికి అభివృద్ధి చెందిన జీ-7 దేశాల కూటమికి, అభివృద్ధి చెందుతున్న గ్లోబల్ సౌత్ దేశాల ప్రతినిధిగా భారత్‌కు మధ్య సమన్వయానికి దోహదపడుతుంది.
- జీ-7 సమావేశాల నేపథ్యంలో జరిగే వివిధ దేశాలతో భారత్ ద్వైపాక్షిక సమావేశాలు భారత్‌కు పలు దేశాలకు మధ్య వాణిజ్య, రక్షణ, దౌత్య సంబంధాలను బలపర్చడానికి ఒక చక్కని అవకాశం.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/yknNzixలో
చదవండి.



పవన్‌కల్యాణ్‌ను కలసిన తెలుగు సినిమా నిర్మాతలు

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను సినీ పరిశ్రమ తరఫున అభినందించేందుకు అపాయింట్‌మెంట్ కోరడానికి వచ్చామని నిర్మాత అల్లు అరవింద్ తెలిపారు. సోమవారం మధ్యాహ్నం విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో పలువురు నిర్మాతలు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కీలక అంశాలపై వారు చర్చించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ.. సినీ పరిశ్రమ తరఫున పవన్ కల్యాణ్‌ను అభినందించడానికి అపాయింట్‌మెంట్ కోరడానికి వచ్చామన్నారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. అదేవిధంగా సీఎం చంద్రబాబుతో భేటీ కావడానికి అపాయింట్ ఇప్పించాలని కోరినట్టు తెలిపారు. దీనిపై చంద్రబాబుతో మాట్లాడి చెబుతానని పవన్ కల్యాణ్ తెలిపినట్లు వివరించారు. తెలుగు చిత్ర పరిశ్రమలో నెలకొన్న సమస్యలపై పూర్తిస్థాయిలో చర్చించ లేదని, త్వరలోనే మరోసారి కలసి చిత్ర పరిశ్రమ సమస్యలు, రాష్ట్రంలో సినీ రంగం విస్తరణకు ఉన్న అవకాశాలపై చర్చిస్తామని చెప్పారు. సమావేశంలో రాష్ట్ర పర్యాటక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, నిర్మాతలు సి.అశ్వనీదత్, ఎ.ఎం.రత్నం, డి.సురేష్ బాబు, ఎస్.రాధాకృష్ణ(చిన బాబు), దిల్‌రాజు, భోగవల్లి ప్రసాద్, డి.వి.వి.దానయ్య, సుప్రియ, ఎన్.వి.ప్రసాద్, బన్నీ వాసు, నవీన్ ఎర్నేని, నాగవంశీ, టి.జి.విశ్వప్రసాద్, వంశీకృష్ణ, వై.రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

- అమరావతి (ఆంధ్రజ్యోతి)

28 ఏళ్ల తర్వాత...





సరిగ్గా 28 ఏళ్ల క్రితం 'అక్కడ అమ్మాయి.. ఇక్కడ అబ్బాయి' చిత్రం విడుదలైంది. చిరంజీవి సోదరుడు పవన్‌కల్యాణ్‌కు, ఏయన్నార్ మనవరాలు సుప్రియకు ఇదే తొలి సినిమా. ఈవీవీ సత్యనారాయణ దర్శకుడు , అల్లు అరవింద్ నిర్మాత. ఆ సినిమా తర్వాత హీరోగా ఎదిగి పవన్‌కల్యాణ్ పవర్‌స్టార్ అయ్యారు. సుప్రియ మాత్రం నటనకు క్రమంగా దూరమై, నిర్మాణరంగంలోకి ప్రవేశించి అక్కడే స్థిరపడ్డారు. సోమవారం ఇతర నిర్మాతలతో పాటు సుప్రియ కూడా పవన్‌కల్యాణ్‌ను కలిశారు. ఈ సందర్భంగా వీరిద్దరూ దిగిన ఫొటో సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తోంది. కొందరైతే 'అక్కడ అమ్మాయి.. ఇక్కడ అబ్బాయి' చిత్రంలోని వీరిద్దరి ఫొటోను.. ఇప్పటి ఫొటోను జతచేసి.. సూపర్ అంటూ కామెంట్లు పెడుతున్నారు.



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టూరిజం, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేశ్‌ను సీనియర్ నిర్మాత కె.ఎస్.రామారావు సోమవారం అమరావతిలో కలసి అభినందించారు. త్వరలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో సమావేశమై సినీ రంగ సమస్యలను చర్చిద్దామని దుర్గేశ్ రామారావుకు చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు సినిమా పరిశ్రమ అభివృద్ధి చెందుతుందనీ, అందుకు సహజమైన లొకేషన్లు, ప్రోత్సహించే ప్రభుత్వం ఉన్నాయని రామారావు తెలిపారు. సినిమా పరిశ్రమ పట్ల అవగాహన కలిగిన దుర్గేశ్ మంత్రిగా ఉన్నందుకు ఆయన హర్షం వ్యక్తం చేశారు.

విశ్వంభర సెట్‌కు వినాయక్




మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న తాజా చిత్రం 'విశ్వంభర' షూటింగ్ ప్రస్తుతం అన్నపూర్ణ సెవెన్ ఏకర్స్‌లో వేసిన భారీ సెట్‌లో జరుగుతోంది. దర్శకుడు వి.వి.వినాయక్ సోమవారం ఈ సెట్‌కు వెళ్లారు. మెగాస్టార్ చిరంజీవిని కలసి కాసేపు ముచ్చటించారు. ఆయనతో తనకున్న ప్రత్యేక అనుబంధాన్ని పంచుకున్నారు. దర్శకుడు వశిష్ఠకు, చిత్ర నిర్మాతలకు అభినందనలు తెలిపారు వినాయక్. మెగాస్టార్ చిరంజీవి, వినాయక్, వశిష్ఠ కలసి ఉన్న ఫొటోని చిత్రం టీమ్ సోషల్ మీడియాలో షేర్ చేసింది. యూవీ క్రియేషన్స్ సంస్థ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా 'విశ్వంభర' చిత్రాన్ని నిర్మిస్తోంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతి కలిగించడానికి అన్ని జాగ్రత్తలు తీసుకుంటోంది. త్రిష, ఆషికా రంగనాథ్ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది జనవరి 10న విడుదల కానుంది. విక్రమ్, వంశీ, ప్రమోద్, నిర్మిస్తున్నారు.

ఒకే తెరపై రజనీ, సల్మాన్



'రాజారాణి', 'తెరి', 'మెర్సల్', 'బిగిల్' చిత్రాలతో సూపర్‌హిట్ డైరెక్టర్ అనిపించుకున్న అట్లీ కుమార్.. బాలీవుడ్‌లోకి అడుగుపెట్టి షారుక్ ఖాన్ చిత్రం 'జవాన్' చిత్రంతో బ్లాక్‌బస్టర్ హిట్ కొట్టారు. ఆయన ప్రస్తుతం సల్మాన్ ఖాన్‌తో ఓ చిత్రం చేస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా అందిన సమాచారం మేరకు ఈ సినిమాలో రజనీకాంత్ కూడా నటించనున్నారు. ఇలా ఒకే తెరపై వీరిద్దరూ కనపడితే.. వారి అభిమానుల ఆనందాలకు హద్దులు ఉండకపోవడమే కాకుండా అది బాక్సాఫీస్‌కు కూడా పండుగ వాతావరణాన్ని తెప్పిస్తుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే ఇందులో రజనీ ఏ పాత్రను పోషిస్తున్నారో ఇంకా తెలియాల్సి ఉంది. ఈ చిత్ర నిర్మాత, సన్ పిక్చర్స్ అధినేత కళానిధి మారన్‌కు సూపర్‌స్టార్‌తో ఉన్న సత్సంబంధాల వల్లే ఈ ప్రాజెక్ట్‌లో నటించేందుకు రజనీ పచ్చజెండా ఊపారని తెలుస్తోంది. ప్రస్తుతం 'సికిందర్' షూటింగ్‌లో సల్మాన్, 'కూలీ' చిత్రీకరణలో బిజీగా ఉన్న రజనీ.. ఆ ప్రాజెక్ట్ పూర్తి కాగానే ఈ సినిమా సెట్స్‌లోకి అడుగుపెట్టనున్నారు.

బాలీవుడ్‌లోకి శ్రీలీల




క్యూట్ బ్యూటీ శ్రీలీల బాలీవుడ్‌లోకి అడుగుపెట్టనున్నారు. డేవిడ్ ధావన్ దర్శకత్వంలో వరుణ్‌ధావన్ నటించబోయే చిత్రానికి శ్రీలీలను ఖరారు చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ చిత్రాన్ని జూలై నుంచి సెట్స్‌పైకి తీసుకువెళ్లడానికి సన్నాహాలు చేస్తున్నారు. కథాంశంగా ట్రయాంగిల్ లవ్ స్టోరీని ఎంచుకున్నారని.. కన్ఫ్యూజన్, కామెడీ కలగలసిన ఈ చిత్రం ప్రేక్షకులని కడుపుబ్బా నవ్వించేలా ఉంటుందట. టైటిల్, ఇతర తారాగణం, సాంకేతిక సిబ్బంది ఇంకా ఖరారు కాని ఈ చిత్రాన్ని రమేశ్ తౌరని నిర్మించనున్నారు. ఇటువంటి క్రేజీ ప్రాజెక్ట్‌తో బాలీవుడ్‌లోకి ఎంటర్ అవుతున్నందున.. ఇక బీ టౌన్‌లో కూడా ఆమె కెరీర్‌కు ఢోకా ఉండదని అంటున్నారు. డేవిడ్ ధావన్, వరుణ్ ధావన్ కలయికలో ఇదివరకు 'మై తేరా హీరో', 'జుడ్వా 2' చిత్రాలు వచ్చి.. బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లను రాబట్టాయి.

ట్రెండ్‌కు అనుగుణంగా..



'హను-మాన్' చిత్రంతో ఈ ఏడాది ప్రారంభంలో బ్లాక్ బస్టర్ హిట్ సాధించిన చిత్ర నిర్మాణ సంస్థ ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్ ఇప్పుడు ప్రియదర్శి, నభా నటేశ్ జంటగా నిర్మిస్తున్న 'డార్లింగ్' చిత్రం జులై19న విడుదల కానుంది. అశ్విన్‌రామ్ ఈ చిత్రానికి దర్శకుడు. రోమ్ కామ్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ సినిమాతో మరోసారి హిట్ సాధిస్తామని నిర్మాతలు నిరంజన్‌రెడ్డి, చైతన్య చెబుతున్నారు. ప్రస్తుత ట్రెండ్‌కు అనుగుణమైన అంశాలతో అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరించడానికి ఈ చిత్రం సిద్ధమవుతోంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ ఫస్ట్ సింగిల్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చిందని తెలిపారు. బ్రహ్మానందం, విష్ణు, కృష్ణతేజ్, అనన్య నాగళ్ల కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రానికి నరేశ్ రామదురై సినిమాటోగ్రాఫర్. హేమంత్ సంభాషణలు రాశారు.



వైజయంతి పాత్రలో మళ్లీ!

విజయతార విజయశాంతి 34 ఏళ్ల క్రితం 'కర్తవ్యం' చిత్రంలో పోలీస్ ఆఫీసర్ వైజయంతి పాత్రను పోషించారు. ఆ చిత్రం ఆమె నట జీవితాన్ని సరికొత్త మలుపు తిప్పడమే కాకుండా జాతీయ స్థాయిలో ఉత్తమ నటిగా అవార్డు తెచ్చి పెట్టింది. ప్రస్తుతం నందమూరి కల్యాణ్‌రామ్ హీరోగా నటిస్తున్న చిత్రంలో విజయశాంతి 'కర్తవ్యం' తరహాలో పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రను పోషిస్తున్నారు. ఆమె పాత్ర పేరు కూడా వైజయంతి కావడం గమనార్హం. విజయశాంతి పుట్టినరోజు సందర్భంగా ఫస్ట్ లుక్ పోస్టర్ ద్వారా ఆమె గెటప్ రివిల్ చేశారు. ఈ పోస్టర్‌తోనే ఆమె పాత్ర ఎంత పవర్‌ఫుల్‌గా ఉంటుందో తెలియజేశారు. అలాగే గ్లింప్స్‌ను కూడా రిలీజ్ చేశారు. 'వైజయంతి ఐపీఎస్.. తను పట్టుకుంటే పోలీస్ తుపాకీకే ధైర్యం వస్తుంది.. వేసుకుంటే యూనిఫామ్‌కే పౌరుషం వస్తుంది. తనే ఒక యుద్ధం.. నేనే తన సైన్యం' అంటూ కల్యాణ్‌రామ్ వాయిస్ ఓవర్‌తో విజయశాంతి పాత్రను పరిచయం చేశారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వంలో అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మిస్తున్నారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/2czlCy9 లో చదవండి.



మంత్రి మనోహర్‌కు వినతిపత్రం అందిస్తున్న యూనియన్ నాయకులు

పంచాయతీ డేటా ఎంట్రీ ఆపరేటర్లను ఆదుకోండి

తెనాలి రూరల్, జూన్ 24: ఏపీ గ్రామ పంచాయతీలలో ఈ-పంచాయతీ డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించి, ఆదుకోవాలని ఏపీ ఈ-పంచాయతీ డేటా ఎంట్రీ ఆపరేటర్ల సంఘం నాయకులు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిసి విజ్ఞప్తిచేశారు. ఆదివారం సాయంత్రం తెనాలిలోని జనసేన పార్టీ కార్యాలయంలో పంచాయతీ డేటా ఆపరేటర్ల సంఘం నాయకులు మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపి వారి సమస్యలపై వినతిపత్రం అందించారు. తాము 11 సంవత్సరాల నుంచి డేటా ఆపరేటర్లుగా పనిచేస్తున్నామని, పంచాయతీలలో ప్రతి బిల్లు అప్‌లోడ్ చేసే విషయంలో కీలకంగా వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. అప్పట్లో రూ.15000 జీతం ఇస్తామని చెప్పి పంచాయతీ నిధుల నుండి రూ.6వేలు మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. గత 8 నెలలుగా పంచాయతీ నిధులు లేవంటూ అవికూడా చెల్లించే పరిస్థితిలేదని వాపోయారు. కూటమి ప్రభుత్వమైనా తమ సేవలను గుర్తించి ప్రభుత్వ ఖజానా నుంచి ఉద్యోగులకు నేరుగా జీతం చెల్లింపులు జరిపి ఉద్యోగ భద్రత కల్పించాలని విన్నవించారు.

కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు బి.వినోద్‌కుమార్, కార్యదర్శి కోటేశ్వరరావు, దొడ్డపనేని నీరజ, జ్యోతి, విరజ, రవితేజ, వీరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



పెమ్మసాని దంపతులను సన్మానిస్తున్న శంకరరావు

గ్రామాల అభివృద్ధికి పెమ్మసాని కృషి చేయాలి

● బీసీ నేత కేసన శంకరరావు

తెనాలి అర్బన్, జూన్ 24: రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల అభ్యున్నతికి కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కృషిచేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు కోరారు. సంఘ సభ్యులతో కలిసి ఆదివారం రాత్రి పెమ్మసాని దంపతులను గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న దుస్థితిని ఆయనకు వివరించామన్నారు. వైసీపీ ప్రభుత్వం గ్రామ పంచాయతీలను నిర్వీర్యం చేయడం, సర్పంచ్‌లకు నిధులు ఇవ్వకుండా వేధించడం వంటి పనులకు పాల్పడిందన్నారు. గ్రామాలను సందర్శించి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి పథకాలను అమలు చేయాలని కోరారు. తన్నీరు ఆంజనేయులు, అన్నవరపు నాగమల్లేశ్వరరావు, బాడుగుల శ్రీనివాస్, బాలాజీ, అశోక్, మహేష్, శివాజీ, స్వాతి, జొన్నాదుల వెంకటేశ్వరరావు, కృష్ణ, రామలింగం తదితరులు మంత్రిని సత్కరించిన వారిలో ఉన్నారు.

వైభవంగా శాంతి హోమాలు

తెనాలి, మారీసుపేట జూన్ 24: స్థానిక గంగానమ్మపేటలోని శ్రీవిద్యాపీఠంలోని సాలిగ్రామ మఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామి) పర్యవేక్షణలో శ్రీనవగ్రహ సహిత శ్రీనక్షత్ర సంపూర్ణ శాంతి హోమ పూజలు కొనసాగుతున్నాయి. ఆదివారం 12వ రోజు ఉత్తరాషాఢ నక్షత్రం వారిచే గణపతి పూజ, రుద్రాభిషేకాలు, గణపతి హోమం, నవగ్రహ హోమం, శ్రీమహామృత్యుంజయ హోమంను యల్లాప్రగడ పవన్‌కుమార్‌శర్మ రుత్విక్కులతో యజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలస్వామి ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ నంబూరి వెంకట కృష్ణమూర్తి, పెనుగొండ వెంకటేశ్వరావు, జాయింట్ సెక్రటరీ ముద్దభక్తుని రమణయ్య, ఉప్పల విశ్వనాధం,రావూరి సుబ్బారావు, రాజేశ్వరరావు రామకృష్ణ, కోన నాగేశ్వరావు, లోకనాదం, జయలక్ష్మి మాతృ మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రైల్వే గడ్డర్‌ను ఢీ కొట్టిన ఆటో: పలువురికి గాయాలు



గడ్డర్‌ను ఢీకొట్టడంతో దెబ్బతిన్న ఆటో, ప్రమాదంలో గాయపడ్డ వృద్ధుడు

తెనాలి, మారీసుపేట జూన్ 24: తెనాలి-చందోలు మార్గంలోని వైకుంఠపురం ఆలయ సమీపంలో రైల్వే బ్రిడ్జికి అమర్చిన ఇనుపగడ్డర్‌ను ఆటో ఢీకొట్టిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పెరవలి నుంచి తెనాలికి పలువురు ప్రయాణికులతో వస్తున్న ఆటో వైకుంఠపురం సమీపంలో రోడ్డు ఎత్తుపల్లంగా ఉండటంతో ఆటో డ్రైవర్ రోడ్డుపైన ఉన్న గుంతను తప్పించబోతూ బ్రేక్‌ఫెయిల్ అయి ఇనుపగడ్డర్‌ను ఢీ కొట్టాడు. అందులో ప్రయాణిస్తున్న పెరవిపాలెంకు చెందిన కంచె సాంబశివరావుకు తీవ్రగాయాలు కాగా మిగిలిన నలుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికులు 108 కి సమాచారం అందించి క్షతగాత్రులను వైద్యం నిమిత్తం జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గత కొన్ని సంవత్సరాలుగా వైకుంఠపురం సమీపంలో రోడ్డు ఎగుడుదిగుడుగా ఉండి అధ్వానంగా తయారైంది. ఆ రోడ్డుపై వాహనాలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయని స్థానికులు తెలిపారు. అదేవిధంగా రైల్వే బ్రిడ్జికి అమర్చిన ఇనుప గడ్డర్లకు కూడా రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయకపోవడంతో కన్పించక రాత్రులు వచ్చే వాహనచోదకులు వాటిని ఢీకొట్టి ప్రమాదాల బారిన పడుతున్నారని, సంబంధిత శాఖ అధికారులు స్పందించి ప్రయాణం సురక్షితంగా జరిగేలా చర్యలు చేపట్టడంతో పాటు రోడ్డు మరమ్మతులు చేపట్టి రేడియం స్టిక్కర్లు కూడా అమర్చాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

1న ఆంధ్ర గాన కోకిల ఏవీ సుబ్బారావు జయంతి

తెనాలి అర్బన్, జూన్ 24: రంగస్థల నటుడు, ఆంధ్ర గానకోకిల ఏవీ సుబ్బారావు 94వ జయంతి జూలై 1వ తేదీన నిర్వహిస్తామని ఆయన కుమారుడు ఆరాధ్యుల వెంకటేశ్వరరావు తెలిపారు. జయంతి పోస్టర్లను సోమవారం విడుదల చేశారు. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఏవీ సుబ్బారావు స్మారక 13వ రంగస్థల పురస్కారం ప్రదానోత్సవ సభ జరుగుతుందన్నారు. ప్రతిఏటా ఇచ్చే రంగస్థల పురస్కారాన్ని చుండూరుకు చెందిన రంగస్థల, సంగీత దర్శకుడు చింతలపూడి చెంచయ్యకు ప్రదానం చేస్తామన్నారు. నాలుగు దశాబ్దాలుగా సంగీత నేపథ్యాన్ని అందిస్తున్నారని చెప్పారు. జయంతిని పురస్కరించుకుని పాండవోద్యోగం, రామాంజనేయ యుద్ధం, చింతామణి, గయోపాఖ్యానం నాటకాలలో సన్నివేశాలను ప్రదర్శిస్తామని చెప్పారు. కళాబంధు వర్ల రామయ్య, కళారత్న గుమ్మడి గోపాలకృష్ణ, నాయుడు గోపి పాల్గొంటారని తెలిపారు. ఆరాధ్యుల ఆదినారాయణ, నాగరాజు, వెంకటకృష్ణారావు, శ్రీనివాసరావు పోస్టర్ ఆవిష్కరించారు.

ప్రజలకు జవాబుదారీగా ఉందాం

● అవినీతిని వదలకపోతే పొన్నూరు వదలాలి
● ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్
● అధికారులకు సుతిమెత్తగా చురకలు
● పురపాలక సంఘంలో శాఖల వారీగా సమీక్ష



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

పొన్నూరు టౌన్, జూన్ 24: ప్రజలకు జవాబుదారీగా ఉండాలని అధికారులను ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ఆదేశించారు. పొన్నూరు పురపాలక సంఘంలో సోమవారం పలు ప్రభుత్వ శాఖలపై ఎమ్మెల్యే సమీక్షలు నిర్వహించారు. ముందుగా పట్టణంలో పలు వార్డుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి పారిశుధ్యం మురుగు కాల్వలను పరిశీలించారు. అనంతరం సమీక్షల్లో మాట్లాడుతూ పొన్నూరు పురపాలక సంఘం టౌన్ ప్లానింగ్ విభాగం అవినీతి నిలయంగా మారిందని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ఆగ్రహం వ్యక్తంచేశారు. పురపాలక సంఘంలో జరిగిన సమావేశంలో శాఖల వారీగా సమీక్షలు జరిపి అధికారులకు సుతిమెత్తగా చురకలు అంటించారు. సచివాలయ వ్యవస్థకు పురపాలక సంఘానికి అసలు అనుసంధానమే లేకుండా పోయిందన్నారు. 17సచివాలయాల ద్వారా 170మంది ఉద్యోగులు అందుబాటులో ఉన్నప్పటికి ప్రజలకు వనగూరిన అదనపు ప్రయోజనం ఏమిటని నిలదీశారు. సచివాలయాల వ్యవస్థ వచ్చినతర్వాత ప్లానింగ్ విభాగం మరింత అవినీతిమయంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ నిర్మాణాలను ఆదాయంగా మల్చుకుని అధికారులు వ్యహరిస్తున్నారని దుయ్యబట్టారు. ప్లానింగ్ శాఖలో ముడుపుల సంస్కృతి రూపుమాపనున్నట్లు చెప్పారు. అధికారులు గతంలో వ్యవహరించిన తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. శానిటేషన్ విభాగంలో పారిశుధ్య కార్మికులను అటెండెన్స్ పేరుతో స్థానభ్రంశం పేరుతో వేధించి కార్మికులను ఇబ్బందులకు గురిచేశారని ఫిర్యాదులు అందాయన్నారు. కష్టజీవుల నుంచి ముడుపులు వసూళ్ళు, వేధింపులు ఆపివేయాలని హెచ్చరించారు. పట్టణంలో పారిశుధ్యం మెరుగుపడాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. పారిశుధ్య విభాగానికి కావలసిన పరికరాల గురించి నివేదిక ఇవ్వాలని కోరారు. మెప్మా విభాగంపై సమీక్ష సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ మాట్లాడుతూ రుణాల మంజూరు డిఫాల్టర్ గ్రూపుల వివరాలు నివేదిక రూపంలో ఇవ్వాలని సూచించారు. అలాగే విలీన ప్రతిపాదిత గ్రామాల్లో డ్వాక్రా గ్రూపులను మెప్మాలో విలీనం చేయటానికి ఎవరి అనుమతులు తీసుకున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మెప్మా విభాగంలో వసూళ్లపర్వం నిలిపివేయకపోతే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఇంజనీరింగ్ విభాగంలో సమీక్ష సందర్భంగా రోడ్లపై రోడ్లు నిర్మించిన అంశాన్ని నరేంద్ర కుమార్ లేవనెత్తారు. రోడ్డు నిర్మించిన మూడు, నాలుగు నెలల కాలానికే రోడ్లు దెబ్బతింటే నాణ్యతలో జరిగిన అవినీతిపై తాము పోరాటం చేశామన్నారు. కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోకుండా రోడ్డుపై రోడ్డు నిర్మించి వదిలివేయటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే సచివాలయాలు ప్రజలకు దూరంగా ఒకేచోట నిర్మించటం, నాణ్యత లోపించటం వంటి అంశాలపై సమీక్ష నిర్వహించి నివేదికలు కోరారు. అవినీతి వదులుకోకుంటే పొన్నూరు వదలాల్సివస్తుందని ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ అధికారులను హెచ్చరించారు. ఈ సమీక్ష సమావేశంలో పురపాలక సంఘంలోని అన్ని విభాగాల అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలో 3వ వార్డులో పారిశుధ్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

కాల్వ కట్టలు, డ్రైయిన్లపై మట్టి తవ్వితే కఠిన చర్యలు

● ఎమ్మెల్యే ధూళిపాళ్ళ

పొన్నూరు టౌన్, జూన్ 24: పొన్నూరు నియోజకవర్గంలో సాగునీటి కాల్వలు, డ్రైయిన్ల కట్టలపై మట్టి తవ్వి తరలిస్తే కఠినచర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఆదేశించారు. చింతలపూడి డీసీసీ కల్యాణ మండలంలో సాగునీటి శాఖ, మురుగు నీటి శాఖ అధికారులతో సమావేశం జరిగింది. ఇట్టికంపాడు డ్రెయిన్ పూడుకుపోయి రైతులు వరదలతో ఇబ్బందులు పడుతున్నారని రైతుల భాగస్వామ్యంతో డ్రెయిన్ పూడికతీత చేపట్టాలని ఆదేశించారు. తాళ్లపాలెం గ్రామం వద్ద టీబీ డ్రెయిన్, వల్లభరావుపాలెం గ్రామం వద్ద కొల్లిమర్ల డ్రెయిన్‌పై మట్టి తవ్వి తరలించుకుపోయిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గత ఐదేళ్ల కాలంగా కాల్వలో పూడికతీతలు చేపట్టకపోవటం వల్ల పంటలకు నీరు అందక, వర్షాల సమయంలో డ్రెయిన్ల నుంచి నీరు బయటకు వెళ్లక పంట పొలాలు నీట మునిగి రైతులు నష్టపోయారన్నారు. రైతు సేవకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. రైతులు ముందుకు వచ్చి కాల్వలు, డ్రెయిన్లకు మరమ్మతులు చేయించుకుంటే అధికారుల పర్యవేక్షణలో పనులు చేయాలని సూచించారు. కాల్వ కట్టల మట్టి బయటకు వెళ్లకుండా చూడాలన్నారు. గుంటూరు నల్లమడ, టీబీ డ్రైయిన్లపై చెక్ డ్యాముల నిర్మాణంపై నివేదికలు కోరారు. చేబ్రోలు మండలంలో అప్పాపురం చానల్‌లో మురుగునీరు కలిసి రైతులు ఇబ్బందులు పడుతున్నారని సమస్య పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్, డ్రెయినేజ్ అధికారులు పాల్గొన్నారు.



సాగు నీటి శాఖ అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్



రోడ్డుపక్కన కాలువ పక్కన పెరిగిన గడ్డి

కాలువల పక్కన గడ్డితొలగించరూ...

తెనాలి రూరల్, జూన్ 24: పట్టణంలోని జయప్రకాశ్ నగర్‌లోని టూటౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో కాలువ ప్రాంతంలో జనావాసాల్లోకి పాములు సంచరిస్తున్నాయని ఆ ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు ఒక పక్కన పంటకాలువ, దాని సమీపంలోని మురుగుకాలువ ఉన్నాయి. దీనికి ఆనుకుని రోడ్డు అంచుల్లో గడ్డిజాతి మొక్కలు పెరిగి పొదలా మారాయి. వర్షం కురుస్తున్న సమయంలో కాలువల ప్రవహించే నీరు పొంగి, విష సర్పాలు వస్తున్నాయి. పొదల్లా ఉన్న గడ్డిజాతి మొక్కల్లో నుంచి స్థానికంగా ఉన్న ఇళ్లలోకి వస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. పాముల బెడదతో అక్కడ ప్రజలు భయం భయంగా గడుపుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు దీనిపై స్పందించి గడ్డిజాతి మొక్కలను తొలగించి కాలువలో నీరు సక్రమంగా ప్రవహించేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

వృద్ధులకు అన్నదానం

తెనాలి, మారీసుపేట జూన్ 24: స్థానిక గాంధీనగర్‌లోని షిరిడి సాయి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం సభ్యులు అన్నదానం చేశారు. సోమవారం ఎస్‌వీ యోగా కన్వీనర్ ముద్దాభక్తుని రమణయ్య, స్వామ్రాజ్యం దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా వారి కుటుంబ సభ్యుల సహకారంతో ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లను పంపిణీచేసి, ఆహారం అందజేశారు. కార్యక్రమంలో వజ్రాల రామలింగాచారి, వై.కోటేశ్వరావు, మురళి, భారతి, సత్యనారాయణ, సునీత, అనూష, యోగ సాధకులు పాల్గొన్నారు.

హెల్త్ స్కీమ్‌ను పునరుద్ధరించాలి

● ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషా

గుంటూరు (తూర్పు), జూన్ 24: గత ప్రభుత్వ నిర్వాకంతో కుంటుపడిన ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్‌ను పునరుద్ధరించాలని నూతన ప్రభుత్వానికి ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా విజ్ఞప్తి చేశారు. సోమవారం, మెడికల్ కళాశాల ఆవరణలోని సంఘ కార్యాలయంలో జరిగిన జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈహెచ్ఎస్ స్కీమ్ పథకాన్ని జగన్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. ఈహెచ్ఎస్ స్కీమ్ కింద ఉన్న 220 కోట్ల రూపాయిలను వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించిందిని ఆరోపించారు. నగదు రహిత చికిత్సలు లేకపోవడంతో ఉద్యో గులు, పెన్షనర్లు తీవ్రంగా ఇబ్బంది పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ విషయంపై స్పందించి ఉద్యోగులకు ఈహెచ్ఎస్ పథకంలోని అడ్డంకులను తొలగించాలని ఆయన కోరారు. సమావేశంలో సంఘ సభ్యులు శివారెడ్డి, పోతురాజు, హరిబాబు, సుబ్బారావు, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

జీవో నం.84ను తక్షణమే రద్దు చేయాలి

● ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సుబ్బారావు

గుంటూరు (విద్య), జూన్ 24: మునిసిపల్, కార్పొరేషన్ పాఠశాలలకు గొడ్డలిపెట్టులా మారిన జీవో నెంబర్ 84ను వెంటనే రద్దు చేయాలని ఏపీటీఎఫ్(1939) రాష్ట్ర కార్యదర్శి మేకల సుబ్బారావు డిమాండ్ చేశారు. సోమవారం నగరంపాలెంలోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన నగరశాఖ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మునిసిపల్, కార్పొరేషన్ పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు బదిలీలు, ప్రమోషన్‌లను చేపట్టాలన్నారు.

మేరీమాత కొండకు కూటమి శ్రేణుల పాదయాత్ర

కొల్లిపర, జూన్ 24: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయం సాధిస్తే విజయవాడ గుణదల మేరీమాత గుడికి పాదయాత్రగా వస్తామని మండల పరిధిలోని మున్నంగి గ్రామానికి చెందిన కూటమి నాయకులు మొక్కుకున్నారు. దీంతో కూటమి అధికారంలోకి రావటంతో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారం చేయడంతో తెనాలి నియోజకవర్గ ఎస్సీసెల్ అధికార ప్రతినిధి అద్దెపల్లి రమేష్‌బాబు, కొల్లిపర మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు కనపాల రవి సోమవారం గుణదల మేరీమాత గుడికి వెళ్ళటానికి పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన పాలనందించేందుకు చంద్రబాబునాయుడు పరిపాలన రావటం సంతోషంగా ఉందన్నారు. మేరీమాత ఆశీస్సులతో చంద్రబాబునాయుడు ప్రజలకు సంక్షేమ పాలన అందించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు యల్లమాటి అనిల్‌కుమార్, చొప్పర కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపు కలెక్టర్‌గా నాగలక్ష్మి బాధ్యతల స్వీకారం

గుంటూరు, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా నూతన కలెక్టర్‌గా నియమితురాలైన ఎస్.నాగలక్ష్మి బుధవారం ఉదయం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈమేరకు సోమవారం ఆమె ఇన్‌చార్జి కలెక్టర్ రాజకుమారి గణియాకు ఫోన్‌చేసి సమాచారం ఇచ్చారు. దీంతో కలెక్టర్ బాధ్యతల స్వీకారానికి సంబంధించి ఏర్పాట్లు చేయాల్సిందిగా కలెక్టరేట్ అధికారులు, సిబ్బందిని ఇన్‌చార్జి కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్‌గా నాగలక్ష్మి బాధ్యతలు చేపట్టిన తర్వాత జిల్లా అధికారులతో పరిచయ కార్యక్రమం ఉంటుందని, దానికి సంబంధించి సమయాన్ని వాట్సాప్ గ్రూపులో పెడతామని రాజకుమారి సోమవారం తెలిపారు.

వివాహానికి బొల్లి వ్యాధి అడ్డుకాదు

● డెర్మటాలజిస్ట్ డాక్టర్ అత్తోట కవిత

గుంటూరు (మెడికల్) జూన్ 24: బొల్లి అంటువ్యాధి కాదని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ డెర్మటాలజీ, వెనిరియాలజీ, లెప్రాలజీ (ఐఏ డీవీఎల్) రాష్ట్ర శాఖ అధ్యక్షురాలు డాక్టర్ అత్తోట కవిత తెలిపారు. వరల్డ్ విటిలిగో డే పురస్కరించుకొని ఐఏ డీవీఎల్ గుంటూరు శాఖ ఆధ్వర్యంలో బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో సోమవారం నిర్వహించిన బొల్లి వ్యాధి అవగాహన కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. శరీరంపై కనిపించే అన్ని తెల్ల మచ్చలు బొల్లి కాదని, చర్మంలో మెలనోసైట్ కణాలు తగ్గడం వల్ల బొల్లి వ్యాధి సోకుతుందన్నారు. బొల్లి చికిత్సల్లో పూత మందులు, ట్యాబ్లెట్లు, ఫోటో థెరపీ, లేజర్ థెరపీ, సర్జరీలు అందుబాటులో ఉన్నాయన్నారు. వ్యాధి కనిపించిన తొలి దశలో వైద్యనిపుణులను సంప్రదించి చికిత్స పొందితే సమర్థవంతంగా నియంత్రివచ్చన్నారు. కార్యక్రమంలో చర్మవ్యాధుల వైద్యనిపుణులు జే సౌజన్య, కేఏ సీతారామ్, ఏ శిరీష, టీ వాణి, ఉషారాణి, ఎస్ సౌమ్య, షకీల, ఎస్ నాగేశ్వరమ్మ, రాహుల్, సింధూర, నీలిమ, లాఫింగ్ క్లబ్ అధ్యక్షుడు లాల్‌వజీర్ పాల్గొన్నారు. తొలుత బొల్లిపై అవగాహన కల్పించేలా ప్లకార్డులు చేతబూని ఎన్టీఆర్ స్టేడియం నుంచి లక్ష్మీపురంలోని మదర్ థెరిస్సా విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. వైద్యులతో పాటు లాఫింగ్ క్లబ్, వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

శారదకాలనీలో ఇరువర్గాల ఘర్షణ

● బోరుగడ్డ అనుచరుడు సహా పలువురికి గాయాలు

గుంటూరు, జూన్ 24: స్థానిక అరండల్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని శారదా కాలనీ 18వ లైన్‌లో సోమవారం వేకువజామున ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. బోరుగడ్డ అనిల్‌కుమార్ అనుచరుడైన శారదా కాలనీకి చెందిన చిన్నహుస్సేన్‌షా మరికొందరు ఓ వివాహానికి హాజరయ్యారు. ఇదే వివాహానికి పొన్నూరు పరిధిలోని నిడుబ్రోలు చెందిన షేక్ దాదా హుస్సేన్ అతని అనుచరులు కూడా హాజరయ్యారు. వివాహ మండపం వద్ద పిల్లలు ద్విచక్ర వాహనం నడిపే విషయంలో వారి మధ్య వివాదం చోటు చేసుకుంది. ఈ విషయమై ఇరువర్గాల మధ్య ఘర్షణ ఏర్పడింది. దీంతో దాదాహుస్సేన్ వర్గీయులు దాడి చేయడంతో బోరుగడ్డ అనుచరుడైన చిన్న హుస్సేన్‌షాతో పాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. అదే విధంగా హుస్సేన్ షా వర్గీయులు చేసిన దాడిలో దాదా హుస్సేన్ వర్గానికి గాయాలయ్యాయి. ఇరువర్గాలు అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకోగా పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతుడికి కుటుంబానికి పరిహారం అందచేస్తున్న సంగం చైర్మన్ నరేంద్ర కుమార్ తదితరులు

పాడి రైతులకు అండగా సంగం డెయిరీ

● చైర్మన్ నరేంద్ర కుమార్

పొన్నూరు టౌన్, జూన్ 24: పాడి రైతులకు అండగా సంగం డెయిరీ నిలుస్తుందని ఆ సంస్థ చైర్మన్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. మండల పరిధిలోని చింతలపూడి లో సంగం డెయిరీ పరిధిలోని పాల రైతు కుటుంబానికి సోమవారం డీవీసీ అభయ డెత్ బెనిఫిట్ పరిహారం అందచేశారు, చింతలపూడి సొసైటీ పరిధిలోని పాల రైతు నల్లూరి సాంబశివరావు ఇటీవల మృతి చెందగా ప్రొడ్యూసర్స్ వెల్ ఫేర్ స్కీమ్ ద్వారా రూ.50వేల నగదు పరిహారాన్ని మృతుడి భార్య హైమావతికి చైర్మన్ నరేంద్రకుమార్ అందించారు. కార్యక్రమంలో సంగం అధికారులు, సొసైటీ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

నూరు శాతం అక్షరాస్యత సాధన కోసం 'నేను బడికి పోతా'

చేబ్రోలు, జూన్ 24: నూరుశాతం అక్షరాస్యత సాధన కోసమే నేను బడికి పోతా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె జ్యోతి తెలిపారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నేను బడికి పోతా, విద్యా ప్రవేశం కార్యక్రమాలపై అవగాహన సదస్సు జరిగింది. ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థుల ప్రవేశం, పాఠశాల్లో అందుతున్న మౌలిక వసతులు, తల్లికి వందనం పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులకు అందించే నగదు ప్రోత్సాహకం తదితర అంశాల గురించి చర్చించారు. కార్యక్రమంలో పలు ప్రభుత్వ శాఖల అధికారులు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

మంత్రి నారా లోకేశ్‌కు శుభాకాంక్షలు తెలిపిన ప్రణీత్

తెనాలి రూరల్, జూన్ 24: ఐటీ, విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నారా లోకేశ్‌ను రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రణీత్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం విద్యావ్యవస్థను అతలాకుతలం చేసిందని ఆరోపించారు. చదువుకున్న విద్యార్థులకు రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు దక్కక పొరుగు రాష్ట్రాలకు వలసలు పోయే దుస్థితికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం దిగజార్చిందని తెలిపారు. గత పాలకుల తప్పిదాలను ఎండగడుతూ యువగళం పాదయాత్రగా రాష్ట్రంలో పర్యటిస్తూ యువత భవిష్యత్తుకు భరోసా కల్పిస్తూ వారిలో ఎంతో ధైర్యాన్ని నింపారని నేడు మంత్రిగా విద్యావ్యవస్థను బలోపేతం చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రణీత్ కోరారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సూక్ష్మ పర్యవేక్షణతో మాతృ మరణాల కట్టడి

● జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ విజయలక్ష్మీ

గుంటూరు (మెడికల్) జూన్ 24: గర్భిణులకు అందే వైద్య సేవలపై అన్ని దశలను సూక్ష్మంగా పర్యవేక్షించడం ద్వారా మాతృ మరణాలను నివారించవచ్చని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే.విజయలక్ష్మీ తెలిపారు. సోమవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో జరిగిన మండల స్థాయి మాతృ మరణాల సమీక్ష నిర్వహించారు. మేలో మున్నంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కొల్లిపర సచివాలయ పరిధిలో నమోదైన రెండు మాతృ మరణాలపై కమిటీ సభ్యులు ప్రధానంగా సమీక్షించారు. ఈ రెండు మరణాలు వైద్యపరంగా నివారించదగిన మరణాలుగా కమిటీ నిర్ధారించింది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మీ మాట్లాడుతూ హైరిస్క్ గర్భిణులను ముందుగానేగుర్తించి వారు సుఖ ప్రసవం అయ్యేంత వరకు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రసవానికి కొద్ది రోజులు ముందే వారిని ప్రభుత్వాస్పత్రికి పంపాలని సూచించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ నోడల్ అధికారి డాక్టర్ బుచ్చిబాబు, ప్రైవేటు నోడల్ ఆఫీసర్ డాక్టర్ రాధిక రాయుడు, గైనకాలజిస్ట్ డాక్టర్ అరుణ, డాక్టర్ సుభాషిణి, డాక్టర్ ఆదిత్య ప్రదీప్ రెడ్డి, డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ శ్రావణ్‌బాబు, డాక్టర్ సీహెచ్ రత్నమన్మోహన్, డాక్టర్ కేవీ సుబ్బరాజు, డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ డాక్టర్ హరిణి పాల్గొన్నారు.



బదిలీపై వెళుతున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డిని సత్కరిస్తున్న జిల్లా ఉన్నతాధికారులు

కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డికి ఘనంగా వీడ్కోలు

గుంటూరు, జూన్24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులుగా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని చిత్తశుద్ధితో ప్రజలకు సేవలందించాలని బదిలీపై వెళుతున్న కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి కలెక్టరేట్‌లోని ఎస్ ఆర్ శంకరన్ హాల్లో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో బదిలీపై వెళుతున్న కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డికి ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సత్ఫలితాలు అందించేలా సక్రమంగా అమలుచేసేందుకు జిల్లా, రెవెన్యూ, మండల, గ్రామ స్థాయి వరకు ఉన్న అధికారులు, ఉద్యోగులు పూర్తి సహకారం అందించారన్నారు. పోలీస్, రెవెన్యూ నగరపాలక సంస్థ, ఇంజనీరింగ్, వ్యవసాయం, విద్యాశాఖ, వైద్యారోగ్య తదితర శాఖలలోని కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించిన అధికారులకు ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. ఈసందర్భంగా వేణుగోపాల్ రెడ్డిని జిల్లా అధికారులు సన్మానించి ఆయన సేవలను ప్రశంసించారు.

కార్యక్రమంలో ఎస్పీ తుషార్ డూడీ, టుబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు, సంయుక్త కలెక్టర్ జీ.రాజకుమారి, నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి పెద్ది రోజా, గుంటూరు రెవెన్యూ డివిజన్ అధికారి శ్రీకర్, డిప్యూటీ కలెక్టర్ (ట్రైనీ) కే.స్వాతి, రాష్ట్ర ఏపీ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు పలువురు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న బొమ్మిడాల భానుమూర్తి,చిత్రంలో అవోపా నాయకులు

గేట్ ర్యాంకర్‌కు రూ.లక్ష ఆర్థికసాయం

గుంటూరు(విద్య),జూన్ 24: గేట్‌లో ర్యాంకు సాధించి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థికి బొమ్మిడాల భానుమూర్తి ట్రస్ట్ ఆర్థిక చేయూతనిచ్చింది. ప్రకాశంజిల్లా అద్దంకి చెందిన ఇంజనీరింగ్ (ఈసీఈ) విద్యార్థి ఘంటసాల రవితేజ గేట్‌లో రెండో ర్యాంకు సాధిం చాడు. ముంబాయి ఐఐటీలో సీటు వచ్చింది. అయితే ఎంటెక్‌లో చేరడానికి ఆర్థిక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో విషయంలో తెలుసుకున్న బొమ్మిడాల భానుమూర్తి ట్రస్ట్ చైర్మన్ బొమ్మిడాల భాను మూర్తి వారి ట్రస్టు ద్వారా రూ.లక్ష ఆర్థికసాయాన్ని విద్యార్థి రవితేజకు అందజేశారు. స్థానిక కాకాని రోడ్డులోని జరిగిన ఈ కార్యక్రమంలో అవోపా రాష్ట్ర అధ్యక్షులు తోటపర్తి రాంబాబు, పీ.శ్రీరాములు, గాంధీక్లబ్ చైర్మన్ బంగారు బాబు, కొలిశెట్టి సతీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.